

# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com




హైదరాబాద్ | మంగళవారం 13-7-2021 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2020-2022 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :27 | సంచిక: 282 | పేజీలు: 4 | వెల: రూ.1/-


# తెలంగాణ ప్రయోజనాల కోసం ఎంతకైనా తెగించి కొట్లాడుతాం : కేటీఆర్

హైదరాబాద్ , జులై 12: కృష్ణా జలాల విషయంలో కానీ, ఇంకో విషయంలో కానీ రాజీ లేకుండా పోరాటం చేసేది ఒక్క టీఆర్ఎస్ పార్టీ మాత్రమే అని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తేల్చిచెప్పారు. కానీ ఈ వివాదంపై బీజేపీ, కాంగ్రెస్ నేతలు రెండు నాలుకల ధోరణితో వ్యవహరిస్తున్నారు. తెలంగాణ ప్రజల ప్రయోజనం కోసం ఎంతకైనా తెగించి కొట్లాడేది టీఆర్ఎస్ పార్టీ మాత్రమే అని కేటీఆర్ స్పష్టం చేశారు.

మంత్రి మల్లారెడ్డి ఆధ్వర్యంలో జవహర్ నగర్ కార్పొరేషన్‌లోని నలుగురు కాంగ్రెస్ కార్పొరేటర్లు, ఘట్‌కేసర్ మున్సిపాలిటీకి చెందిన కాంగ్రెస్ కౌన్సిలర్లు చేరారు. ఈ సందర్భంగా వారందరికీ గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి కేటీఆర్ సాదరంగా ఆహ్వానించారు.

అనంతరం తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన సభలో కేటీఆర్ ప్రసంగించారు.

మేడ్చల్ నియోజకవర్గంలోనే 10 మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు ఉన్నాయి. మీ అందరి మద్దతుతో పదింటికి పదిని మంత్రి మల్లారెడ్డి గెలిపించుకున్నారు. ప్రజల్లో పార్టీపై విశ్వాసం ఉండడం వల్లే గెలుపు సాధ్యమైతుందన్నారు. అత్యంత ఎక్కువ సమస్యలు ఉన్న ప్రాంతం జవహర్ నగర్. ఈ కార్పొరేషన్ అభివృద్ధికి తప్పకుండా నిధులు మంజూరు చేస్తామన్నారు. జవహర్ నగర్ ప్రజలకు దుర్గంధం లేకుండా చర్యలు చేపడుతామన్నారు. జీవో నం. 58, 59 ప్రకారం ఇండ్ల పట్టాలు ఇచ్చినట్లే.. ఇవ్వాలని జవహర్ నగర్ ప్రజలు కోరారు. హెచ్ఎండీఏ పరిధిలో ఉంది కాబట్టి ఆ ప్రకారం ఇండ్ల పట్టాలు ఇవ్వలేకపోయాం. ఈ సమస్యను సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారిస్తామని చెప్పారు. నగర శివారు మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలని మంత్రులు మల్లారెడ్డి, సబితా ఇంద్రారెడ్డికి సూచించామని తెలిపారు.

కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రాన్ని సాధించుకోవడమే కాదు.. అభివృద్ధి బాటలో పయనింపజేస్తున్నామని చెప్పారు. అన్ని వర్గాల అభివృద్ధే ధ్యేయంగా ముందుకు పోతున్నాం. కరోనాను కూడా లెక్క చేయకుండా అభివృద్ధి ఫలాలు సామాన్యులకు అందించామన్నారు. ప్రతి పేద వ్యక్తికి టీఆర్ఎస్ ప్రభుత్వం అండగా ఉంటుందని స్పష్టం చేశారు. ఎవరెన్ని కుప్పిగంతులు వేసినా.. కొన్ని పదవులు రాగానే కోతికి కొబ్బరిచిప్ప దొరికినట్టు ప్రవర్తిస్తున్నారు. అలాంటి వారిని మనం పట్టించుకోవాల్సిన అవసరం లేదు. తెలంగాణ ప్రజలపై పూర్తి విశ్వాసం ఉందన్నారు. ఏ ఎన్నిక అయినా.. టీఆర్ఎస్ పార్టీని గెలిపిస్తున్నారు. కేసీఆర్ నాయకత్వమే తెలంగాణకు శ్రీరామరక్ష అని భావించి.. ఇతర పార్టీల నేతలు టీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నారు అని కేటీఆర్ పేర్కొన్నారు.

# ఈ నెల 19 నుంచి పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు: లోక్‌సభ స్పీకర్

న్యూఢిల్లీ, జులై 12: ఈ నెల 19 నుంచి పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ప్రారంభం కానున్నాయని లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా ప్రకటించారు. జులై 19 నుంచి ఆగస్టు 13 సమావేశాలు కొనసాగుతాయని ఆయన తెలిపారు. ఆ రెండు తేదీల మధ్య మొత్తం 19 పనిదినాల్లో ఉభయసభల కార్యకలాపాలు జరుగుతాయని చెప్పారు. పార్లమెంట్ వర్షాకాల సమావేశాల ప్రారంభం కానున్న నేపథ్యంలో స్పీకర్ ఓంబిర్లా ఇవాళ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన స్పీకర్.. సమావేశాల నిర్వహణకు సంబంధించి కాసేపు మీడియాతో మాట్లాడారు. కొవిడ్ నిబంధనలను అనుసరించి వచ్చే ఎంపీలు, మీడియా ప్రతినిధులు అందరినీ పార్లమెంటు లోపలికి అనుమతిస్తారని స్పీకర్ ఓం బిర్లా స్పష్టంచేశారు. ఆర్టీపీసీఆర్ పరీక్ష రిపోర్టు తప్పనిసరి కాదని చెప్పారు. అయితే ఇప్పటికీ వ్యాక్సిన్ వేయించుకోని వారు మాత్రం దయచేసి వ్యాక్సిన్‌లు వేయించుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

అయితే పార్లమెంట్‌లో ఇప్పటివరకు మొత్తం 322 మంది ఎంపీలకు వ్యాక్సినేషన్ పూర్తయ్యింది. ఇక పార్లమెంట్ సమావేశాలు ప్రతిరోజు ఉదయం 11 గంటలకు మొదలై సాయంత్రం 6 గంటల వరకు కొనసాగుతాయని స్పీకర్ ఓం బిర్లా తెలిపారు. పార్లమెంట్ ఉభయసభలకు (లోక్‌సభ, రాజ్యసభ) ఇవే టైమింగ్స్ వర్తిస్తాయని ఆయన వెల్లడించారు.

# కారెక్కిన ఎల్.రమణ.. ఆహ్వానించిన కేటీఆర్



హైదరాబాద్ , జులై 12:తెలంగాణ టీడీపీ మాజీ అధ్యక్షుడు ఎల్.రమణ గులాబీ గూటికి చేరారు. టీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమక్షంలో రమణ టీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా రమణకు గులాబీ కండువా కప్పి పార్టీలోకి కేటీఆర్ సాదరంగా ఆహ్వానించారు. కేటీఆర్ చేతుల మీదుగా ఎల్ రమణ.. టీఆర్ఎస్ పార్టీ ప్రాథమిక సభ్యత్వం తీసుకున్నారు. ఈ సందర్భంగా రమణకు కేటీఆర్‌తో పాటు పలువురు నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రులు కొప్పుల ఈశ్వర్, గంగుల కమలాకర్‌తో పాటు ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన టీఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఇక జులై 16న ఎల్ రమణ ముఖ్యమంత్రి కేసీఆర్ సమక్షంలో లాంఛనంగా టీఆర్ఎస్‌లో చేరుతారు. ఆ రోజు తన అనుచరులు, టీడీపీ నేతలు, పెద్ద ఎత్తున కార్యకర్తలతో కలిసి రమణ గులాబీ తీర్థం పుచ్చుకోనున్నారు. ఈ కార్యక్రమానికి తెలంగాణభవన్ లేదా కరీంనగర్ వేదిక అయ్యే అవకాశం ఉంది.

ఇటీవలే ఎల్.రమణ మంత్రి ఎర్రబెల్లితో కలిసి ప్రగతి భవన్ లో సీఎం కేసీఆర్ ను కలిసిన సంగతి తెలిసిందే. ఆ మరుసటి రోజే తెలంగాణ టీడీపీ అధ్యక్ష పదవికి ఆయన రాజీనామా చేశారు. రాజీనామా లేఖను టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబుకు పంపారు. ఇక రమణకు రాజకీయ భవిష్యత్తుపై కేసీఆర్ స్పష్టమైన హామీ ఇచ్చినట్లు తెలుస్తోంది. తెలంగాణలో ఖాళీ కానున్న ఆరు ఎమ్మెల్యేల కోటా, ఒక గవర్నర్ కోటా ఎమ్మెల్సీ స్థానాల్లో ఒక ఎమ్మెల్సీ స్థానాన్ని రమణకు ఇచ్చి మండలికి పంపుతారని ప్రచారం జరుగుతోంది. అంతేకాదు హుజురాబాద్ ఉప ఎన్నికలో టీఆర్ఎస్ అభ్యర్థిగా ఎల్.రమణను బరిలోకి దింపే అవకాశాలు ఉన్నట్లు ఊహాగానాలు వినిపిస్తున్నాయి.

# కరోనా సెకండ్ వేవ్ నుంచి బయటపడ్డాం : డీహెచ్ శ్రీనివాసరావు

హైదరాబాద్ , జులై 12: కరోనా రెండో దశవ్యాప్తి నుంచి రాష్ట్రం బయటపడిందని వైద్య ఆరోగ్యశాఖ సంచాలకులు శ్రీనివాసరావు అన్నారు. కరీంనగర్‌లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కరోనా కట్టడిలో, వ్యాక్సినేషన్‌లో రాష్ట్రం మోడల్‌గా నిలిచిందన్నారు.

మిగతా రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణలో బాధాకరమైన, నిస్సహాయకరమైన పరిస్థితులు ఎక్కడా కనిపించలేదన్నారు. రాష్ట్రంలో ఆక్సిజన్ పడకల కొరత లేకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. దేశంలోని ఎన్నో రాష్ట్రాల్లో ఆక్సిజన్ సరఫరా లేక రోగులు మృతి చెందారని, దవాఖానల్లో బెడ్స్ లేక ఇబ్బందులు పడ్డారన్నారు. రాష్ట్రంలో వైద్య సౌకర్యాల కొరత లేదని స్పష్టం చేశారు.

తెలంగాణలో ఏ సమయంలోనూ ఎలాంటి ఇబ్బందులు లేవని.. మొదటి వేవ్ సమయంలో 28వేల బెడ్స్ ఉంటే రెండో దశ వరకు 50వేలకు పెంచినట్లు చెప్పారు. మూడో దశ ముప్పు పొంచి ఉందని వైద్యనిపుణులు హెచ్చరిస్తున్న నేపథ్యంలో అన్ని రకాలుగా సంసిద్ధమైనట్లు వెల్లడించారు. హైదరాబాద్‌తో పాటు ఇతర జిల్లాల్లో ఉన్న ఆసుపత్రుల్లో పిల్లల ఐసీయూ ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. మహమ్మారి తగ్గుముఖం పట్టినప్పటికీ ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, కరోనా నిబంధనలను కచ్చితంగా పాటించాలని అన్నారు. ప్రభుత్వం ఎన్ని చర్యలు తీసుకున్నా.. ప్రజల సహకారం లేనిదే మహమ్మారి కట్టడి చేయడం సాధ్యం కాదన్నారు.

గత ఏడాదిగా పాటిస్తూ వస్తున్న మాస్కులు ధరించడం, భౌతిక దూరం పాటించడం, చేతులను తరచూ శుభ్రం చేసుకోవడం కొనసాగించాలన్నారు. వీలైనంత వరకు జనసమూహాలతో కూడిన కార్యక్రమాలకు దూరంగా ఉండాలన్నారు. అయితే, వైరస్ నుంచి పూర్తిగా ముప్పు తొలగిపోలేదని, వైరస్ ప్రవర్తన ప్రజలపైనే ఆధారపడి ఉంటుందన్నారు. కేసులు తగ్గుముఖం పడుతున్న ప్రజలు మాస్కులు ధరించడం, వ్యాక్సిన్ తీసుకోవడం కొనసాగించాలన్నారు. రాష్ట్రంలో శరవేగంగా వ్యాక్సినేషన్ జరుగుతోందని, ఇప్పటి వరకు 1.25 కోట్ల డోసులు పంపిణీ చేశామని చెప్పారు. మరో వైపు మరోవైపు రాష్ట్రంలో ఫీవర్ సర్వే కొనసాగుతోందని, దీని ద్వారా పాజిటివిటీ రేటు తగ్గించుకోవచ్చని చెప్పారు.

వానాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. పల్లె ప్రగతి, పట్టణ ప్రగతి కార్యక్రమాలతో మంచి ఫలితాలు వస్తున్నాయన్నారు. గత మూడు, నాలుగేళ్లలో మలేరియా, డెంగ్యూ, చికున్ గున్యా, టైఫాయిడ్ కేసులు తగ్గాయన్నారు. అన్ని జిల్లాల్లోనూ కొత్తగా మలేరియా కేసులు నమోదు కాలేదని వివరించారు. జిల్లాల్లో కొనసాగుతున్న ఫీవర్ సర్వేపై సీఎం, రాష్ట్ర కేబినెట్‌కు సమర్పించనున్నట్లు తెలిపారు. సీఎం కేసీఆర్ నేతృత్వంలో ప్రభుత్వమ హమ్మారి కట్టడికి అన్ని రకాలుగా చర్యలు తీసుకుంటుందని, ప్రజలు ఆందోళనకు గురికావాల్సిన అవసరం లేదన్నారు.

# కరోనా థర్డ్ వేవ్ తప్పదు.. అదీ త్వరలోనే: ఇండియన్ మెడికల్ అసోసియేషన్

న్యూఢిల్లీ, జులై 12:కరోనా సెకండ్ వేవ్ నుంచి కోలుకొని ఇప్పుడిప్పుడే మళ్లీ గాడిన పడుతున్న దేశానికి ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) వార్నింగ్ ఇచ్చింది. కరోనా థర్డ్ వేవ్ తప్పదని, అది కూడా త్వరలోనే రాబోతోందని ఐఎంఏ చెప్పడం గమనార్హం. ఇలాంటి సమయంలో అధికారులు, ప్రజలు నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై అసంతృప్తి వ్యక్తం చేసింది. ప్రపంచంలో ఏం జరిగిందో మనకు తెలుసు. గతంలో మహమ్మారులను చూసినా తెలుస్తుంది. థర్డ్ వేవ్ తప్పదు. అయినా దేశంలోని చాలా ప్రాంతాల్లో ప్రభుత్వాలు, ప్రజలు నిర్లక్ష్యంగా ఉన్నారు. కొవిడ్ నిబంధనలు పాటించకుండా వేడుకలు చేసుకుంటున్నారు అని ఐఎంఏ ఒక ప్రకటనలో చెప్పింది.

టూరిజం, తీర్థయాత్రలు, మత సంబంధమైన వ్యవహారాలు అవసరమే కానీ.. వాటిని మరికొన్ని నెలలు ఆపవచ్చు. వ్యాక్సినేషన్ పూర్తి కాకుండా ఇలాంటి వాటికి ప్రజలను అనుమతిస్తే వీళ్లే సూపర్ స్ప్రెడర్లుగా మారి కరోనా థర్డ్ వేవ్‌కు కారణమవుతారు అని ఆ ప్రకటనలో ఐఎంఏ హెచ్చరించింది. కొవిడ్ నిబంధనలు పాటించడం, వ్యాక్సినేషన్ ద్వారా కొవిడ్ థర్డ్ వేవ్ ప్రభావాన్ని తగ్గించవచ్చని కూడా చెప్పింది. వచ్చే రెండు, మూడు నెలలపాటు ఎలాంటి అలసత్వం లేకుండా వ్యవహరించాలని స్పష్టం చేసింది.

# ప్రతి ఒక్కరూ టీకా తీసుకోవాలి : గవర్నర్ తమిళిసై



రంగారెడ్డి, జులై 12:: ప్రతి ఒక్కరూ టీకా తీసుకోవాలి.. కరోనా నుంచి రక్షణ పొందాలి అని రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందర్ రాజన్ పిలుపునిచ్చారు. మహేశ్వరం నియోజకవర్గం పరిధిలోని కేసీ తండాలో గవర్నర్ ఇవాళ పర్యటించారు. ఈ సందర్భంగా కేసీ తండాలో గవర్నర్ రెండో డోసు టీకా తీసుకున్నారు.

ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు సమావేశంలో గవర్నర్ పూర్తిగా తెలుగులో ప్రసంగించి అందర్నీ ఆకట్టుకున్నారు. గవర్నర్ ప్రసంగం.. మీ అందర్ని కలవడం చాలా సంతోషంగా ఉంది. గిరిజన ప్రజలంటే తనకు చాలా అభిమానం, ప్రేమ అని చెప్పారు. గిరిజన గ్రామాల్లో వ్యాక్సినేషన్ తక్కువగా జరుగుతోందని తెలిసింది. మీకందరికి ధైర్యం చెప్పేందుకు కేసీ తండాకు వచ్చాను. అందరూ ధైర్యంగా వ్యాక్సిన్ తీసుకోవాలి. మనందరం వ్యాక్సిన్ తీసుకుంటే కొవిడ్‌ను జయించొచ్చు. అందరూ వ్యాక్సిన్ తీసుకోవాలి.. ఇతరులకు కూడా వ్యాక్సిన్ తీసుకోవాలని చెప్పాలి. నేను కేసీ తండాలో వ్యాక్సిన్ తీసుకొని విన్నపం చేస్తున్నాను.. అందరూ వ్యాక్సిన్ తీసుకోని కొవిడ్ నుంచి రక్షణ పొందాలి. అందరూ తప్పకుండా మాస్కు ధరించడంతో పాటు భౌతిక దూరం పాటించాలన్నారు. తరుచూ చేతులను శానిటైజర్‌తో శుభ్రంగా కడుక్కోవాలి. కొవిడ్ నుంచి రక్షణ పొందాలి అని గవర్నర్ తమిళిసై సూచించారు.

# కేరళలో మరొకరికి జికా వైరస్.. 19కి చేరిన కేసుల సంఖ్య

తిరువనంతపురం, జులై 12:: కేరళలో జికా వైరస్ చాప కింద నీరులా విస్తరిస్తున్నది. అక్కడ ఇప్పటికే 18 మంది జికా వైరస్ బారినపడగా తాజాగా మరో కేసు బయటపడింది. దాంతో రాష్ట్రంలో మొత్తం జికా వైరస్ కేసుల సంఖ్య 19కి చేరింది. అనారోగ్యంతో కేరళ రాజధాని తిరువనంతపురంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వృద్ధురాలికి జికా వైరస్ సోకినట్లు తేలింది. ఆమె నుంచి శాంపిల్స్‌ను సేకరించి పరీక్షించగా జికా వైరస్ ఉన్నట్లు నిర్ధారణ అయ్యింది. ఈ విషయాన్ని కేరళ వైద్య ఆరోగ్య శాఖ మంత్రి వీనా జార్జ్ మీడియాకు వెల్లడించారు.

# రాజేంద్రనగర్‌లో కారులో మంటలు.. కాలి బూడిదైన కారు



హైదరాబాద్ , జులై 12:రాజేంద్రనగర్‌లో మరోసారి ఓ కారులో మంటలు చెలరేగాయి. అత్తాపూర్ పీవీ ఎక్స్‌ప్రెస్‌వే వద్ద సోమవారం నడుస్తున్న కారులో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. గమనించిన స్థానికులు అప్రమత్తమైన వెంటనే కారును నిలిపివేయించారు. కారు నడుపుతున్న మహిళతో పాటు పిల్లలను దింపివేశారు. కాసేపట్లోనే కారులో మంటలు వ్యాపించి దగ్ధమైంది. అయితే కారులో మంటలకు చెలరేగడానికి కారణాలు మాత్రం తెలియరాలేదు. స్థానికులు వెంటనే అప్రమత్తంగా వ్యవహరించడంతో ప్రాణాపాయం తప్పింది. మామిడిపల్లి నుంచి హైదరాబాద్‌లోని ఆసుపత్రికి వెళ్తుండగా ఘటన చోటు చేసుకుంది. కాగా మూడురోజుల క్రితం అత్తాపూర్‌లో ఓ కారులో మంటలు చెలరేగిన సంగతి తెలిసిందే.

# ఏపీలో కొత్తగా 1578 మందికి కరోనా పాజిటివ్..

అమరావతి, జులై 12:ఏపీలో కరోనా కేసులు రోజురోజుకు తగ్గుతున్నాయి. గడిచిన 24 గంటల్లో 1,578 మందికి పాజిటివ్గా నిర్ధారణ అయింది. రాష్ట్రవ్యాప్తంగా 62,657 మందికి కొవిడ్ టెస్టులు నిర్వహించారు.

తాజా గణాంకాలతో కలిపి ఇప్పటి వరకు నమోదైన కేసుల సంఖ్య 19,24,421కి పెరిగాయి. మొత్తం 18,84,202 మంది కరోనా నుంచి కోలుకున్నారు. ఇప్పటి వరకు 13,024 మంది మృతి చెందారు. ప్రస్తుతం రాష్ట్రంలో 27,195 యాక్టివ్ కేసులు ఉన్నాయి. ఇప్పటి వరకు రాష్ట్ర వ్యాప్తంగా 2,30,48,945 మంది శాంపిల్స్ ని పరీక్షించడం జరిగింది. తూర్పుగోదావరి జిల్లాలో అత్యధికంగా 305 కేసులు, శ్రీకాకుళం జిల్లాలో అత్యల్పంగా 31 కేసులు నమోదయ్యాయి. ఇదే సమయంలో రాష్ట్ర వ్యాప్తంగా 22 మంది మహమ్మారి బారిన పడి ప్రాణాలు కోల్పోయారు. గత 24 గంటల్లో 3,041 మంది కరోనా నుంచి కోలుకున్నారు.

# ఘనంగా పూరీ జగన్నాథ రథయాత్ర..



భువనేశ్వర్, జులై 12: ఒడిశాలో పూరీ జగన్నాథ రథయాత్ర ఘనంగా కొనసాగుతున్నది.

కరోనా మహమ్మారి విస్తరణ కారణంగా గత ఏడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా ప్రభుత్వం భక్తులను అనుమతించకపోయినా.. పూరీ రాజు, వేద పండితులు, ఆలయ అర్చకులు, సిబ్బంది కలిసి రథయాత్రను ఘనంగా నిర్వహించారు.

ఆషాఢ శుక్ల విదియ నాడు అంటే ఇవాళ.. వేద పండితులు మేళతాళాలతో ఉదయకాల పూజలు నిర్వహించి 'మనిమా' (జగన్నాథా) అంటూ పెద్దపెట్టున నినాదాలు చేస్తూ ఉత్సవమూర్తులను కదిలించడం ద్వారా రథయాత్రా పర్వం మొదలైంది.

అనంతరం ఉత్సవమూర్తులైన సుభద్ర, జగన్నాథ, బలభద్రులను ఆనందబజారు, అరుణస్తంభం మీదుగా ఊరేగిస్తూ రథం వెనుక భాగం నుంచి తీసుకువచ్చి రత్నపీఠం మీద అలంకరింపజేశారు. ఈ ఉత్సవాన్ని 'పహండీ' అంటారు. ఆ తర్వాత గుండిచా ఆలయానికి వెళ్లేందుకు ఉత్సవమూర్తులు రథంపై సిద్ధమై ఉండగా.. 'ఇలపై నడిచే విష్ణువు'గా గౌరవాభిమానాలను అందుకునే పూరీ రాజు పల్లకీలో అక్కడికి చేరుకున్నారు. ఆ తర్వాత ఆయన పరమాత్ముడి ముందు సేవకుడిగా మారి బంగారు చీపురుతో రథాలను ఊడ్చాడు. దీన్నే 'చెరా పహరా' అంటారు.

మహారాజు బంగారు చీపురుతో రథాలను ఊడ్చిన అనంతరం రథయాత్ర మొదలైంది.

# బీహార్‌లో తెరుచుకున్న కాలేజీలు.. అప్రమత్తంగా ఉన్నామన్న సీఎం

పాట్నా, జులై 12:: బీహార్‌లో మళ్లీ కాలేజీలు తెరుచుకున్నాయి. ఇవాళ్టి నుంచి ఆ రాష్ట్రంలో 11, 12వ తరగతులకు కాలేజీలు ప్రారంభం అయ్యాయి. చాన్నాళ్ల తర్వాత మళ్లీ కాలేజీకి రావడంతో విద్యార్థులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మిత్రులను కలుసుకుని ఆనందంలో తేలిపోయారు. రాష్ట్రంలో కరోనా కేసులు తగ్గడంతో మళ్లీ కాలేజీలు ప్రారంభం అయ్యాయి. ఈ నేపథ్యంలో ఆ రాష్ట్ర సీఎం నితీశ్ కుమార్ కూడా స్పందించారు. కరోనా థర్డ్ వేవ్ వస్తుందన్న జాగ్రత్తలో తాము ఉన్నట్లు ఆయన చెప్పారు. కేంద్రం కూడా చాలా జాగ్రత్తగా అన్నింటినీ పరిశీలిస్తోందన్నారు. ఆక్సిజన్‌తో పాటు అన్నీ అందుబాటులో ఉంచామన్నారు. హాస్పిటళ్లు, అధికారులు సంసిద్ధంగా ఉన్నారన్నారు. అందరూ జాగ్రత్తగా ఉన్నారని, పరిస్థితిని నిరంతరం మానిటర్ చేస్తున్న సీఎం నితీశ్ వెల్లడించారు.

## చరిత్రలో నేటినిజం

నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం



కం॥ జాతిపతాకగ నిలచుచు
గీతములను బాడి ప్రజల గేహాములలో_సం
గీతముగా వెలుగొందెడి
శీతగ పేరొందె 'కేసరిబాయి' ధరన్ !!



...శ్రీ

( జులై 13 మరాఠీ గాయని కేసరీబాయి కేర్కర్ జయంతి..)

సెల్: 9494481210


వురిమళ్ల ఫౌండేషన్ - అక్షరాల తోవ

VURIMALLA FOUNDATION REGD. NO 228 OF 2019

జాతీయస్థాయి కథలు, కవితల పోటీ - 2021 ఫలితాలు

కీ॥శే॥ వురిమళ్ల శ్రీరాములు స్మారక కథల పోటీ విజేతలు :

ప్రథమ బహుమతి : (కథ: ఆడబిడ్డ) శివప్రసాద్, హైద్రాబాద్.
ద్వితీయ బహుమతి : (కథ: వలసదుఃఖం) బి. కళాగోపాల్, నిజామాబాద్.
తృతీయ బహుమతి : (కథ: గురుత్వ ఆకర్షణ) అత్తలూరి విజయలక్ష్మి, హైద్రాబాద్.

ప్రోత్సాహక బహుమతులు :
(కథ: మనిషికీ మనిషికీ మధ్య) చొక్కర తాతారావు, విశాఖపట్నం.
(కథ: ఎన్నుగర్ర) సాగర్ల సత్తయ్య, నల్లగొండ.
(కథ: నమ్మకమే నాన్న) ఆర్.సి. కృష్ణస్వామిరాజు, తిరుపతి
(కథ: సవ్యక్రమస్య-గతిరాస్తే) శైలజామిత్ర, హైద్రాబాద్.
(కథ: వార్ధికోత్సవం) జి. రంగబాబు, అనకాపల్లి.

న్యాయ నిర్ణేత : శ్రీకంఠస్ఫూర్తి గారు, కాకినాడ
ప్రముఖ కథా రచయిత, కవి, కథా విశ్లేషకులు

ఈ కథల పోటీకి రెండు తెలుగు రాష్ట్రాల నుండే కాక విదేశాల నుంచి కూడా విశేషమైన స్పందన రావడం చాలా సంతోషంగా వుంది.
మొత్తం 210కి పైగా కథలు రావడం.... అందులోంచి అత్యుత్తమైన వాటికి బహుమతులు ప్రకటించడం జరిగింది.
విజేతలకు శుభాకాంక్షలు...
న్యాయ నిర్ణేత : శ్రీకంఠస్ఫూర్తి గారికి ప్రత్యేక ధన్యవాదాలు.

కీ॥శే॥ వురిమళ్ల పద్మజ స్మారక కవితల పోటీ విజేతలు :

ప్రథమ బహుమతి : (అక్షయపాత్ర ఆగ్రహిస్తే..) వై.హెచ్.కె. మోహన్‌రావు, గుంటూరు.
ద్వితీయ బహుమతి : (నాలుగు రెక్కలపిట్ట) సాంబమూర్తి లండ, శ్రీకాకుళం.
తృతీయ బహుమతి : (వంటరి పిట్టనై) వాడపర్తి వెంకటరమణ, శ్రీకాకుళం.

ప్రోత్సాహక బహుమతులు :
(వెతికిపెట్టండి) పద్మావతి రాంభక్త, విశాఖపట్నం.
(ఇప్పుడు) బి. కళాగోపాల్, నిజామాబాద్
(ఆరోగ్యలక్ష్మి) ఉప్పల పద్మ, మిర్యాలగూడ.

న్యాయ నిర్ణేత : శ్రీ దాట్ల దేవదానం రాజు గారు, యానాం
ప్రముఖ కవి, కథకులు, విమర్శకులు

ఈ కవితల పోటీకి రెండు తెలుగు రాష్ట్రాల నుండే కాక విదేశాల నుంచి కూడా విశేషమైన స్పందన రావడం చాలా సంతోషంగా వుంది.
మొత్తం 250కి పైగా కవితలు రావడం.... అందులోంచి అత్యుత్తమైన వాటికి బహుమతులు ప్రకటించడం జరిగింది.
విజేతలకు శుభాకాంక్షలు...
న్యాయ నిర్ణేత : శ్రీ దాట్ల దేవదానం రాజు గారికి ప్రత్యేక ధన్యవాదాలు.

ఈ కథలు, కవితల పోటీల్లో పాల్గొని, విజయవంతం చేసిన రచయితలకు, కవులకు హృదయ పూర్వక ధన్యవాదాలు.

కీ॥శే॥ భోగోజు పురుషోత్తం - సముద్రమ్మ గార్ల స్మారక సాహితీ పురస్కారం - 2021 సం॥ గాను ప్రముఖ కవి, రచయిత, విమర్శకులు డా॥ దిలావర్ ఉమ్మడి ఖమ్మం జిల్లా గారిని ఎంపిక చేయడ జరిగింది.

ఇట్లు :
వురిమళ్ల సునంద, భోగోజు ఉపేందర్‌రావు, వురిమళ్ల ఫౌండేషన్, ఖమ్మం.
సెల్ : 9441815722, 9494773969

# నలభై వసంతాల ఐటి దిగ్గజ సంస్థ ఇన్ఫోసిస్

నేటినిజం
మంగళవారం 13-7-2021

యువ ఔత్సాహిక ఇంజనీర్ యన్. ఆర్. నారాయణ మూర్తి సతీమణి ఔత్సాహికురాలు, రచయిత, టీచర్, సామాజిక సేవకురాలైన శ్రీమతి సుధా మూర్తి తను పొదుపు చేసిన ? 10,000/-లను (వి250/-) పెట్టుబడిగా చేసుకొని ఇన్ఫోసిస్ కంపెనీని 07 జులై 1981 శుభోదయాన నారాయణ మూర్తి, మరో ఆరుగురు యువ ఇంజనీర్ మిత్రులతో (రాఘవన్, దినేష్, నందన్ నిలేకని, గోపాల కృష్ణన్, శిబూలాల్, అశోక్ అరోరా) కలిసి 'ఇన్ఫోసిస్ సాఫ్ట్‌వేర్ కంపెనీ'ని పూనే నగరంలో స్థాపించారు. ఈ చిరు మె?క్క కాలంతో పాటు అనేక రెట్లు మహావృక్షంగా శాకోపశాఖలుగా ఎదిగి, భారతదేశం నుంచి అభివృద్ధి చెందిన అంతర్జాతీయ అగ్రసేన ఐటి దిగ్గజ సంస్థగా పేరును నిలుపుకుంటుందని నాడు ఎవరూ ఊహించి ఉండరు. గత నాలుగు దశాబ్దాలుగా ఇన్ఫోసిస్ కంపెనీ ఇంతింతై వటుడుంతై ఎదుగుతూ, నేడు వి 80 బిలియన్ల మార్కెట్ కాపిటల్ కలిగి, 2.5 లక్షల ఉద్యోగులతో ప్రపంచవ్యాప్తంగా తన అద్వితీయ సేవలను అందిస్తున్నది. నారాయణ మూర్తితో పాటు మరో ఆరుగురు సహ-వ్యవస్థాపకుల జట్టు కృషితో ఇన్ఫోసిస్ అతివేగంగా అభివృద్ధి దిశగా వడివడిగా అడుగులు వేసింది. ఇన్ఫోసిస్ జట్టుకు నారాయణ మూర్తి నమ్మకస్తుడిగా, కంపెనీ పితామహుడిగా నేటికీ కొనసాగడం సంతోషదాయకం. 1980ల్లో ఒక బియస్‌యన్‌యన్ ఫోన్ కనెక్షన్ తీసుకోవడమే కష్టమైన వేళ, ప్రభుత్వ అనుమతులు తీసుకోవడం, ఆధునిక కంప్యూటర్లు కొనుగోలు చేయడం లాంటి పలు అడ్డంకులను అధిగమిస్తూ ఇండియాలో ఒక ఐటి కంపెనీ స్థాపించడం ఓ సాహసమే. నాడు ఐటి అంటే ప్రజలకు అంత అవగాహన ఉండేది కాదు. బ్యాంకులు కూడా ఐటి కంపెనీలకు రుణాలు ఇవ్వడానికి సానుకూలంగా ఉండేవి కాదు. అనేక ఒడుదుడుకులను అధిగమిస్తూ అంకితభావం, కఠోర కృషి, క్రమశిక్షణ, ఆశావహ దృక్పథం, టీమ్ వర్క్‌తో శ్రమించిన ఫలితంగా అసాధ్యాలు సుసాధ్యం అయ్యాయి.

ఇన్ఫోసిస్ బహుళజాతి కంపెనీకి ప్రారంభంలో ప్రథమ దీర్ఘ కాలపు వినియోగదారుడిగా అమెరికాకు చెందిన 'డాటా బేసిక్స్ కార్పోరేషన్' నిలిచింది. ప్రపంచ స్థాయి సాఫ్ట్‌వేర్ రూపకల్పనలో సఫలీకృతమైన చిన్న ఇన్ఫోసిస్ సంస్థ దినదనాభివృద్ధి చెందుతూ అంతర్జాతీయ వినియోగదారులను ఆకర్షించడం ప్రారంభమైంది. కంపెనీ ఎదుగుదలకు శ్రమిస్తున్న ఉద్యోగులకు సకాలంలో వేతనాలు, పలు సంక్షేమ చర్యలు తీసుకొనుటలో ఏనాడు వెనుకబడని కారణంగా ఇన్ఫోసిస్ కంపెనీ సత్ఫలితాలను చూడగలిగింది. ప్రారంభ దశలో వేతనాలు చెల్లించడానికి సుధా మూర్తి నగలను బ్యాంకులో తాకట్టు పెట్టడానికి కూడా వెనుకాడలేదు. 1983లో కంపెనీ ప్రధాన కార్యాలయాన్ని బెంగుళూరుకు మార్చి, 1987లో ప్రథమ విదేశీ కార్యాలయం బోస్టన్, యుయస్‌లో ప్రారంభించారు. 1993లో పబ్లిక్ ఇష్యూకి వెళ్ళడం, 1999 నాటికి వార్షిక రెవెన్యూ వి100/- మిలియన్, 2002లో వి500/- మిలియన్, 2004లో వి 1బిలియన్, 2010లో వి 10బిలియన్, 2021లో వి14 బిలియన్ల రెవెన్యూ మార్కులను త్వరత్వరగా దాటుతూ చరిత్ర సృష్టించింది. 2012లో ఫోర్బ్స్ జాబితాలో అత్యంత ఇన్నొవేటివ్ సంస్థగా, 2021లో ప్రపంచ నైతిక కంపెనీ జాబితాలో అరుదైన చోటు దక్కించుకుంది.

టిసియస్, విప్రో, ఇన్ఫోసిస్, హెచ్‌సియల్ లాంటి ఐటి కంపెనీలకు దేశ విదేశాల్లో బహుళజాతి సంస్థలుగా మంచి పేరుంది. 1990ల్లో దేశ ఐటి విభాగం 60 శాతం, 2000ల్లో 30 శాతం, 2010ల్లో 12 శాతం అభివృద్ధిని సాధించాయి. ఇన్ఫోసిస్ అనుబంధ సంస్థలుగా ఇన్ఫోసిస్ బిపియం, ఎడ్జ్‌వెర్వ్, పనయా, స్కావా, ఇన్ఫోసిస్ కన్సల్టింగ్, ఇంజనీరింగ్ సర్వీసెస్, డిజిటల్ మార్కెటింగ్ లాంటివి వివిధరంగాల్లో సేవలు చేస్తున్నాయి. 1981 నుంచి 2014 వరకు ఇన్ఫోసిస్ వ్యవస్థాపక సిఈఓగా నారాయణ మూర్తి సేవలు అందించారు. 2002-2007 మధ్య నందన్ నిలేకని, 2007-2011 మధ్య గోపాలకృష్ణన్, 2011-2014 మధ్య శిబూలాల్, 2014-2017 మధ్య విశాల్ సిక్కా, 2018 నుంచి సలీల్ యస్. పరేఖ్ సిఈఓలుగా కంపెనీ అభివృద్ధిలో భాగస్వాములైనారు. యుయస్‌లో టాక్స్ ఎగవేత, విసా ఫ్రాడ్, ఆర్థిక అవకతవకలు లాంటి వివాదాలను ఎదుర్కొంటున్నప్పటికీ ఇన్ఫోసిస్ బహుళజాతి కంపెనీ దేశ ఐటి ప్రతిభను ప్రపంచదేశాలకు పరిచయం చేయడం సంతోషదాయకం. రాబోయే రోజుల్లో మరింత విస్తరిస్తూ, దేశ యువతకు ఉద్యోగాలను కల్పిస్తూ, ఐటి రంగంలో ఇతర కంపెనీలను మార్గదర్శనం చేయాలని కోరుకుందాం. దేశభక్తిగల పౌరులందరూ ఇన్ఫోసిస్ వ్యవస్థాపకులు సుధా నారాయణ మూర్తి దంపతులకు శుభాకాంక్షల మాలలు అందజేద్దాం.

(ఇన్ఫోసిస్ ఐటి కంపెనీ 40 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా)

-డా: బుర్ర మధుసూదన్ రెడ్డి

## మధ్య ప్రదేశ్‌లో కొన్ని ప్రాంతాలలో పిడుగు పాటు కారణంగా సంతాపం తెలిపిన ప్రధాన మంత్రి

న్యూఢిల్లీ, జులై 12:మధ్య ప్రదేశ్ లోని కొన్ని ప్రాంతాల లో పిడుగు పాటు కారణం గా ప్రాణనష్టం జరిగినందుకు ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ సంతాపాన్ని వ్యక్తం చేసి, బాధితుల కు పరిహారాన్ని ప్రకటించారు.

"మధ్య ప్రదేశ్ లోని కొన్ని ప్రాంతాల లో పిడుగుపాటు కారణం గా ప్రాణనష్టం జరిగిందని తెలిసి దుఃఖం కలిగింది. బాధితుల కు రాష్ట్ర ప్రభుత్వం సాధ్యమైన అన్ని రకాలు గాను సాయపడుతుంది. మృతుల దగ్గరి సంబంధికుల కు 2 లక్షల రూపాయల వంతున, అలాగే గాయపడ్డ వారికి 50,000 రూపాయల వంతున పిఎమ్ఎన్ఆర్ఎఫ్ నుంచి ఇవ్వడం జరుగుతుంది: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ" అని ఒక ట్వీట్ లో పిఎమ్ఒ తెలిపింది.

## ఉత్తమ్ డైరెక్షన్‌లో కౌశిక్.. పీసీసీలో ఏం జరుగుతోంది?



హైదరాబాద్ , జులై 12:తెలంగాణ కాంగ్రెస్ పార్టీకి తాజా మాజీ పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్ కుమార్ రెడ్డితో ముప్పు ఉందా? ఆయన పార్టీ మారుతున్నారా? లేక తన వర్గం వారిని నెమ్మదిగా అధికార టీఆర్ఎస్ పార్టీలో చేర్చేందుకు ప్లాన్ చేస్తున్నారా? అన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

గత అనుభవాలు చూస్తే మాజీ పీసీసీ అధ్యక్షులుగా పని చేసిన వారిలో కొందరు కాంగ్రెస్ పార్టీకి గుడ్ చెప్పారు. ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ కు పీసీసీ చీఫ్ లు గా పని చేసిన కె కేశవరావు, డి శ్రీనివాస్ లు ఆ తర్వాత కాలంలో టీఆర్ఎస్ లో చేరారు. ఆ క్రమంలో ఇప్పుడు మరో మాజీ పీసీసీ చీఫ్ ఉత్తమ్ కూడా కారులో ప్రయాణిస్తారా? అన్న సందేహం వ్యక్తం అవుతోంది. ప్రస్తుతం కౌశిక్ రెడ్డి ఆడియో వ్యవహారం రాష్ట్రవ్యాప్తంగా సంచలనం అయిన నేపథ్యంలో ఉత్తమ్ కాంగ్రెస్ లో ఉంటాడా? లేక కారెక్కుతాడా? అన్న డౌట్ టీ కాంగ్రెస్ వర్గాల్లో వ్యక్తం అవుతోంది.

హుజురాబాద్ టీఆర్ఎస్ టికెట్ తనకే అంటూ ఉత్తమ్ తమ్ముడు కౌశిక్ రెడ్డి ఆడియాపై సర్వత్ర చర్చ జరుగుతోంది. కొద్ది రోజులు క్రితం మంత్రి కేటీఆర్ తో కౌశిక్ రెడ్డి భేటీ అయినప్పుడే ఆయన కాంగ్రెస్ పార్టీని వీడుతారని ప్రచారం జరిగింది. అయితే, ఈ అంశంపై ఉత్తమ్ మాట్లాడకపోవడం చర్చనీయాంశమైంది. కౌశిక్ ఉత్తమ్ మాట జవదాటడు అని వాదన ఉంది. అంతేకాదు ఉత్తమ్ డైరెక్షన్ లేకుండా ఆయన ఏమీ చేయడని పేరుంది. ఈ నేపథ్యంలో కౌశిక్ టీఆర్ఎస్ లో చేరడంతో తర్వాత ఉత్తమ్ కూడా ఆ బాటే పడతారా ? అన్న ప్రచారం జరుగుతోంది. ఇప్పటికే పీసీసీ క్రమశిక్షణ సంఘం కౌశిక్ రెడ్డికి షోకాజ్ నోటీసులు జారీ చేసింది. ఆయనపై వేటే వేసే అవకాశం ఉంది.

నిజానికి ఉత్తమ్ తనికి తాను కాంగ్రెస్ లాయలిస్ట్ గా చెప్పుకుంటారు. సోనియా, రాహుల్ కు బాగా దగ్గరవాడు అన్న టాక్ కూడా ఉంది. కానీ, ప్రస్తుత పరిస్థితి అందుకు పూర్తిగా భిన్నంగా ఉంది. ఉత్తమ్ హయాంలో కాంగ్రెస్ పార్టీ వరుసగా ఓటములు చవిచూసింది. ఉత్తమ్ సహా పార్టీలోని కొందరు టీఆర్ఎస్ పార్టీకి కోవర్ట్ గా వ్యవహరిస్తున్నారని గతంలో కొందరు సీనియర్ నేతలు బహిరంగంగానే వ్యాఖ్యానించారు. సొంత పార్టీకి సంబంధించిన అంశాలను టీఆర్ఎస్ కు లీకులు ఇచ్చి.. కాంగ్రెస్ పార్టీకి ద్రోహం చేశారని ఆరోపణలు వినిపించాయి. తాజాగా కౌశిక్ రెడ్డి వ్యవహారంతో ఇప్పుడు అందరి చూపు ఉత్తమ్ పైనే ఉన్నాయి.

## రూ.137 కోట్లు.. 57 థీమ్ పార్కులు

### -పాల్గొన్న మేయర్ విజయలక్ష్మి, ఎమ్మెల్యే దానం

హైదరాబాద్ , జులై 12:జీహెచ్ఎంసీ పరిధిలో రూ.137కోట్ల వ్యయంతో 57 థీమ్ పార్కులను అభివృద్ధి చేస్తున్నామని నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి తెలిపారు. జూబ్లీహిల్స్ రోడ్ నంబర్ 92లో జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మోనోలిత్ థీమ్ పార్కును మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌తో కలిసి ప్రారంభించారు.నగరంలో ఇప్పటికే 919 పార్కులను అభివృద్ధి చేశామని, 504 ట్రీ పార్కులను అభివృద్ధి చేస్తున్నామన్నారు. అనంతరం ఎమ్మెల్యే దానం నాగేందర్ మాట్లాడుతూ..జూబ్లీహిల్స్ రోడ్ నంబరు 92లో ఏర్పాటు చేసిన మోనోలిత్ థీమ్ పార్కును 11వందల గజాల స్థలంలో ఏర్పాటు చేశామన్నారు.తక్కువ సమయంలోనే సుందరమైన థీమ్ పార్కును సిద్ధం చేసిన అధికారులకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ శ్రీలతారెడ్డి, జోనల్ కమిషనర్ ప్రావీణ్య, జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వెంకటేష్, మాజీ కార్పొరేటర్ సూర్యనారాయణ, నర్సింగరావు పాల్గొన్నారు.




# నేడు టోక్యో ఒలింపిక్స్‌లో పాలుపంచుకొనే భారతదేశం క్రీడాకారులతో మాట్లాడనున్న ప్రధాన మంత్రి

న్యూఢిల్లీ, జులై 12:టోక్యో ఒలింపిక్స్ కు వెళ్లే భారతదేశ క్రీడాకారుల తో ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ మంగళవారం జులై 13న సాయంత్రం 5 గంటల కు వీడియో కాన్ఫరెన్స్ మాధ్యమం ద్వారా మాట్లాడుతారు.

క్రీడాకారులు ఆటల పోటీల లో పాలుపంచుకొనే కన్నా ముందు వారికి ప్రేరణ ను అందించే ప్రయాస లో భాగంగా వారి తో ప్రధాన మంత్రి మాట్లాడనున్నారు. టోక్యో-2020 కి వెళ్తున్న భారతదేశ దళానికి ఉద్దేశించిన సౌకర్యాల కోసం సాగుతున్న సన్నాహాల ను గురించి ప్రధాన మంత్రి ఇటీవలే ఒక సమీక్ష ను నిర్వహించారు. కొంత మంది క్రీడాకారుల స్ఫూర్తిదాయకమైన యాత్రల ను గురించి ఆయన 'మన్ కీ బాత్' ('మనసు లో మాట' కార్యక్రమం) లో చర్చించారు కూడాను; అంతేకాదు, దేశ ప్రజల ను ముందడుగు వేసి క్రీడాకారుల ను హృదయపూర్వకం గా సమర్థించవలసిందంటూ ప్రధాన మంత్రి విజ్ఞప్తి చేశారు.

ఈ కార్యక్రమానికి యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రి శ్రీ అనురాగ్ ఠాకుర్, యువజన వ్యవహారాలు, క్రీడల శాఖ సహాయ మంత్రులు శ్రీ నిసిథ్ ప్రమాణిక్, చట్టం-న్యాయం శాఖ మంత్రి శ్రీ కిరెన్ రిజిజూ లు కూడా హాజరు అవుతారు.

భారతదేశ దళం గురించి :

భారతదేశం నుంచి 18 క్రీడా విభాగాల లో మొత్తం 126 మంది క్రీడాకారులు టోక్యో కు బయలుదేరి వెళ్లనున్నారు. ఏదైనా ఒలింపిక్ క్రీడోత్సవాల లో భారతదేశం నుంచి వెళ్తున్న ఈ దళమే ఇప్పటి వరకు ఒలింపిక్స్ కు వెళ్లిన దళాలన్నిటి లోకీ అతి పెద్ద దళం. ఈసారి భారతదేశం 18 వేరు వేరు క్రీడా విభాగాల లో మొత్తం 69 పోటీల లో పాల్గొననుంది. భారతదేశం ఇంత పెద్ద సంఖ్య లో వేరు వేరు పోటీల లో పాలుపంచుకొంటూ ఉండడమనేది ఇంతవరకు జరుగలేదు.

ఈ సారి భారతదేశం తరపున వివిధ ఆటల లో మొదటి సారి గా భాగం పంచుకోవడం జరుగుతోంది. ప్రాతినిధ్యం విషయానికి వస్తే మొదటి సారి గా నమోదు కాబోతున్న అంశాలు అనేకం ఉన్నాయి. చరిత్ర లో ఒకటో సారి గా, భారతదేశానికి చెందిన ఒక ఫెన్సర్ (భవానీ దేవి) ఒలింపిక్ క్రీడోత్సవాల కు అర్హత ను సంపాదించారు. నేత్ర కుమానన్ ఒలింపిక్ క్రీడల కోసం అర్హత సాధించిన ప్రప్రథమ మహిళా నావికురాలు (సైలర్) గా ఉన్నారు. సాజన్ ప్రకాశ్, శ్రీహరి నటరాజ్ లు భారతదేశం పక్షాన ఈత లో 'ఎ' అర్హత ప్రమాణాన్ని చేజిక్కించుకొని ఒక ఒలింపిక్స్ కు భారతదేశం నుంచి అర్హత ను సాధించిన తొలి ఈత క్రీడాకారులు గా ఉన్నారు.

# "ఈశాన్య ప్రాంతం యొక్క మొత్తం సామాజిక-ఆర్థిక అభివృద్ధి వేగవంతం చేయడమే తమ ప్రధాన కార్యక్రమం" -కేంద్రమంత్రి జి. కిషన్ రెడ్డి

న్యూఢిల్లీ, జులై 12:కేంద్ర సాంస్కృతిక, పర్యాటక, ఈశాన్యప్రాంత అభివృద్ధి శాఖ మంత్రి (డిఓఎన్ఈఆర్) శ్రీ జి. కిషన్ రెడ్డి ఈశాన్య ప్రాంతంలో జరుగుతున్న వివిధ అభివృద్ధి కార్యకలాపాలు మరియు కార్యక్రమాలను సమీక్షించారు. ఈ రోజు ముగిసిన డోనేర్ రెండు రోజుల సమగ్ర మంత్రివర్గ సమీక్ష సమావేశం తరువాత శ్రీ కిషన్ రెడ్డి "ఈశాన్య ప్రాంతం యొక్క మొత్తం సామాజిక-ఆర్థిక అభివృద్ధి వేగవంతం చేయడమే తమ ప్రధాన కార్యక్రమంగా ఉందని" స్పష్టం చేశారు.

ప్రస్తుతం కొనసాగుతున్న ప్రాజెక్టుల న్నింటినీ నిర్ణీత కాలపరిమితిలో పూర్తి చేయాలని శ్రీ కిషన్ రెడ్డి సీనియర్ అధికారు లను కోరారు. పెండింగ్‌లో ఉన్న అన్ని ప్రాజెక్టులను ఇతర మంత్రిత్వ శాఖలతో సరైన సంప్రదింపుల విధానం ద్వారా త్వరగా పరిష్కరించాలని ఆయన అన్నారు. ఎ.కార్యదర్శి డోనేర్ డాక్టర్ ఇందర్ జిత్ సింగ్ మరియు సీనియర్ అధికారులు రెండు రోజుల సమీక్షా సమావేశంలో డోనర్ మంత్రిత్వ శాఖ యొక్క అన్ని ప్రాజెక్టులు, పథకాలు మరియు విధానాల గురించి మంత్రికి సమగ్ర ప్రదర్శన ఇచ్చారు. అంతకు ముందు, గురువారం డోనర్ మంత్రిత్వ శాఖ బాధ్యతలు స్వీకరించిన తరువాత శ్రీ రెడ్డి మాట్లాడుతూ " ఈశాన్య ప్రాంతంలో గత ఏడు సంవత్సరాలలో ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో గతంలో ఎప్పుడు జరగని విధంగా నమ్మశక్యం కాని రీతిలో అన్ని రంగాలలో అభివృద్ధి జరిగిందని" అన్నారు. శ్రీ మోదీ మార్గదర్శకత్వంలో ఈ ప్రాంతంలో పెండింగ్‌లో ఉన్న అన్ని ప్రాజెక్టులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయడానికి ప్రయత్నిస్తానని చెప్పారు.

# పెట్రోల్ ధరలపై నిరసన.. తెలంగాణ వ్యాప్తంగా కాంగ్రెస్ ధర్నాలు

హైదరాబాద్ , జులై 12:పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు భారీగా పెరిగిన నేపథ్యంలో తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపట్టింది. హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద నిరసన తెలపడానికి పీసీసీ కొత్త వర్కింగ్ ప్రెసిడెంట్ అంజన్‌కుమార్ యాదవ్ ఎడ్లబండి మీద వచ్చారు. అయితే, ధర్నాకు అనుమతి లేదంటూ పోలీసులు ఆయనను అరెస్టు చేయడానికి యత్నించడంతో ఉద్రిక్తత నెలకొంది. దీంతో పలువురు ఆందోళన కారులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.మరోవైపు ఇందిరా పార్క్, ధర్నా చౌక్ వద్దకు వచ్చిన మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీత రావు, ఇతర మహిళా నేతలను పోలీసులు అరెస్టు చేశారు. అలాగే, మాజీ మంత్రులు గీతారెడ్డి, పొన్నాల లక్ష్మయ్యతో పాటు రాములు నాయక్, ఫిరోజ్ ఖాన్ ఇతర కాంగ్రెస్ నేతలు హైదరాబాద్‌లో నిరసనలో పాల్గొన్నారు. వారిని కూడా పోలీసులు అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌లకు తరలించారు. పెట్రోల్, డిజిల్, వంటగ్యాస్ ధరలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ నిర్మల్‌లో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి, ఏఐసీసీ కార్యక్రమాల సమన్వయ కర్త మహేశ్వర్ రెడ్డి నేతృత్వంలో భారీ నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు వేలాదిగా తరలివచ్చారు.

మహబూబ్ నగర్‌లోనూ పెట్రోల్ ధరల పెంపునకు నిరసనగా కాంగ్రెస్ ఆందోళనకు దిగింది. ఎడ్లబండ్లతో పాటు సైకిళ్లతో కాంగ్రెస్ నేతలు ర్యాలీ నిర్వహించారు. అటు వికారాబాద్ జిల్లా కేంద్రంలోని ఆలంపల్లి నుంచి ఎన్టీఆర్ చౌరస్తా వరకు సైకిల్, బండి ర్యాలీలో నిర్వహించారు. ఈ నిరసనలో మాజీ మంత్రి గడ్డం ప్రసాద్ కుమార్‌తో పాటు పలువురు పాల్గొన్నారు. రంగారెడ్డి జిల్లా కందుకూరులో ఎడ్లబండ్ల ఎక్కి అక్కడి కాంగ్రెస్ నేతలు నిరసన తెలిపారు.






## విజయవాడలో నిరుద్యోగుల నిరసన.. అరెస్ట్ చేసిన పోలీసులు

ఏపీలో నూతన జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలంటూ నిరుద్యోగ సంఘాలు ఆందోళన బాట పట్టాయి. ఈ మేరకు కొన్నిరోజులుగా నిరుద్యోగులు పలు ప్రాంతాల్లో ఆందోళనలు చేస్తూనే ఉన్నారు. సోమవారం నాడు విజయవాడ శివారులోని ఇబ్రహీంపట్నంలో ప్రభుత్వ శాఖలలో ఉన్న ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో పలువురు నిరుద్యోగులు ఆందోళన చేపట్టారు. అంతేకాకుండా నిరుద్యోగుల వయోపరిమితిని 47 ఏళ్లకు పెంచాలని వారు డిమాండ్ చేశారు. దీంతో వెంటనే పోలీసులు ఆందోళన చేస్తున్న వారిని అరెస్ట్ చేసి సమీపంలోని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

# తెలంగాణ టీడీపీ అధ్యక్షుడిగా రావుల చంద్రశేఖర్‌రెడ్డి?

హైదరాబాద్ , జులై 12:తెలంగాణ టీడీపీ చీఫ్ ఎల్.రమణ పార్టీ ఫిరాయించడంతో ఇప్పుడు కొత్త బాస్ ఎవరన్న అంశంపై టీడీపీ వర్గాల్లో జోరుగా చర్చ నడుస్తోంది. టీడీపీ చీఫ్ పదవి సీనియర్ నేతకు ఇవ్వాలా..? లేక దూకుడుగా ఉండే నేతకు అప్పగించాలా..? అని చంద్రబాబు తర్జనభర్జన పడుతున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుత పరిస్థితుల్లో తెలంగాణలో పార్టీ నిలబడాలంటే దూకుడు స్వభావం ఉన్న నేతకు టీడీపీ చీఫ్ పదవి ఇవ్వాలని కొందరు నేతలు భావిస్తుండగా.. సీనియర్ నేతకు ఇస్తే పార్టీ బలోపేతం అవుతుందని మరికొందరు అభిప్రాయపడుతున్నారు. దీనిపై రెండు రోజుల్లో క్లారిటీ వచ్చే అవకాశం ఉంది.

అయితే చంద్రబాబు పార్టీ సీనియర్ నేతకు పదవి ఇవ్వాలని భావిస్తే రావుల చంద్రశేఖర్‌రెడ్డికి ఆ అవకాశం లభించనున్నట్లు సమాచారం. ఇటీవల పార్టీ ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, అధికార ప్రతినిధులతో చంద్రబాబు వర్చువల్ సమావేశాలు జరిపి అభిప్రాయాలు సేకరించారు. మెజార్టీ నేతలు రావుల చంద్రశేఖర్ రెడ్డి పేరు సూచించినట్లు సమాచారం. రావుల చంద్రశేఖర్ రెడ్డి మహబూబ్ నగర్ జిల్లాకు చెందిన నేత. 1982లో కానాయపల్లి సర్పంచ్ రాజకీయ జీవితాన్ని ప్రారంభించారు. తర్వాత టీడీపీ జిల్లా కార్యదర్శి, జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్, రాజ్యసభ సభ్యుడు.. ఇలా అంచలంచెలుగా ఎదుగుతూ వచ్చారు. వివాదరహితుడనే పేరు కూడా ఉంది. దీంతో చాలామంది నేతలు ఆయన పేరును చంద్రబాబుకు సిఫార్సు చేసినట్లు తెలుస్తోంది.

## కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల గద్దెదింపడానికి ప్రజలు సిద్ధం

**- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ వ్యతిరేక విధానాలను గడప, గడపకు తీసుకెళ్లాలి**
**-అధికారమే లక్ష్యంగా కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలి**
**-మాజీ కేంద్ర మంత్రి బలరాం నాయక్**
**-పెట్రోల్, డీజిల్ ధరల పెంపునకు నిరసిస్తూ సిరిసిల్లలో కాంగ్రెస్ సైకిల్ ర్యాలీ**





రాజన్న సిరిసిల్ల, జులై 12: (నేటినిజం ప్రతినిధి): ప్రజా, వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను గద్దే దింపడమే లక్ష్యంగా ప్రతీ కాంగ్రెస్ కార్యకర్త సైనికుడిగా పనిచేయాలని కాంగ్రెస్ మాజీ కేంద్రమంత్రి బలరాం నాయక్ మాజీ కేంద్రమంత్రి బలరాం నాయక్ పిలుపునిచ్చారు.సోమవారం పెంచిన పెట్రోల్, డీజిల్,గ్యాస్, నిత్యావసర ధరలకు నిరసనగా పిసిసి పిలుపుమేరకు కాంగ్రెస్ నాయకులు రాజన్న సిరిసిల్ల ఎడ్ల బండ్లు, సైకిల్, తో జిల్లా కేంద్రంలోని కార్గిల్ లేక్ నుంచి అంబేద్కర్ చౌక్ వరకు ర్యాలీ నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బలరాంనాయక్ మాట్లాడుతూ ప్రజలచే ఎన్నుకోబడ్డ బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ కంపెనీల కోసం పనిచేస్తుందని విమర్శించారు. అధికారంలోకి వచ్చినప్పటినుంచి 45 సార్లు పెట్రోల్, డీజిల్ ధరలను పెంచడం దారుణమని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కేంద్రం, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ 2023 లో అధికారంలోకి రానుందని జోస్యం చెప్పారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలకు రాష్ట్రంలోని గడప, గడపకు తీసుకెళ్లి ప్రజలను చైతన్యంచేసి అధికారమే లక్ష్యంగా కాంగ్రెస్ కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని బలరాంనాయక్ పిలుపునిచ్చారు.ఆనంతరం రాజన్న సిరిసిల్ల డీసీసీ అధ్యక్షులు నాగుల సత్యనారాయణ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను పెంచి సామాన్యులపై భారం మోపిందని విమర్శించారు.టీపీసీసీ కార్యదర్శి ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ రాహుల్ గాంధీని ప్రధాన మంత్రిని చేయడమే లక్ష్యంగా ప్రతీ కార్యకర్త పనిచేయాలన్నారు. దేశ సమగ్రత కాంగ్రెస్ తోనే సాధ్యమని,రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టడం ఖాయమన్నారు.

పెట్రోల్, డీజిల్ ధరలను జిఎస్టీ పరిధిలోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు . ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జడ్పీటీసీ నాగం కుమార్ ,కాంగ్రెస్ నాయకులు సంగీత శ్రీనివాస్ ఆకునూరి బాలరాజు,సూర్య దేవరాజ్ గంట మధుకర్ ,సంగీత శ్రీనాథ్ ,సాగరం వెంకటస్వామి , ముడికె చంద్రశేఖర్, చిలుక రమేష్, కూరగాయల కొమురయ్య ,నాగుల విష్ణుప్రసాద్ పిల్లి కనకయ్య వకుళాభరణం శ్రీనివాస్,షేక్ ఫిరోజ్ పాషా ,చిలుకల తిరుపతి చింతపంటి రామసామి,కనికరపు రాకేశ్,నాగుల రాము,కోల్ కాని రాజు జగన్మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సమ్మేటివ్, ఫార్మేటివ్ పరీక్షల ఆధారంగా పదో తరగతి గ్రేడ్లు..

అమరావతి, జులై 12:కరోనా మహమ్మారీ నేపథ్యంలో ఏపీలో పదో తరగతి ఫలితాల విషయంలో ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రస్తుత విద్యా సంవత్సరంతో పాటు గత విద్యా సంవత్సరానికి సంబంధించి కూడా 'ఆల్ పాస్'కు బదులు గ్రేడ్లు ప్రకటించాలని నిర్ణయించింది. విద్యా సంవత్సరంలో విద్యార్థులు రాసిన సమ్మేటివ్, ఫార్మేటివ్ పరీక్షల మార్కుల ఆధారంగా పదో తరగతి గ్రేడ్లు ఇవ్వనున్నారు. గతేడాది కరోనా వల్ల పరీక్షలు నిర్వహించే పరిస్థితి లేక రాష్ట్ర విద్యా శాఖ విద్యార్థులందరినీ ఉత్తీర్ణులుగా ప్రకటించింది. వారి ధ్రువపత్రాల్లో సబ్జెక్టులకు గ్రేడ్లు బదులు.. పాస్ అని మాత్రమే ఇచ్చారు. దీంతో వారి ఉన్నత చదువులకు ఇబ్బందులేర్పడ్డాయి. కరోనా మహమ్మారి వల్ల గత విద్యా సంవత్సరం(2019?20)లో పదో తరగతి పరీక్షలు నిర్వహించకపోవడం వల్ల 'ఆల్ పాస్'గా ప్రకటించిన విద్యార్థులందరికీ తాజాగా గ్రేడ్లు ఇవ్వాలని రాష్ట్ర విద్యా శాఖ నిర్ణయించింది.

# 23 కంపెనీల నెట్ వర్క్ ని బట్టబయిలు చేసిన సిజిఎస్‌టి అధికారులు

న్యూఢిల్లీ, జులై 12:ఇంటలిజెన్స్ ద్వారా అందిన సమాచారంతో ఢిల్లీ (పశ్చిమ) కేంద్ర వస్తు, సేవల పన్ను కమిషనరేట్ కి చెందిన యాంటీ-ఇవేజన్ విభాగం (ఎగవేత దారులను పట్టుకునే విభాగం) అధికారులు సరుకు లేకుండానే రూ.91 కోట్ల ఇన్వాయిస్లను సృష్టించడం ద్వారా లభ్యత / వినియోగం అనుమతిలేని ఇన్‌పుట్ టాక్స్ క్రెడిట్ (ఐటిసి) ను పొందిన బండారాన్ని బట్టబయలు చేశారు. అనుమతిలేని క్రెడిట్ ను పొందేలా బహుళ సంస్థలను సృష్టించడమే దీనివెనుక ఉన్న గూడుపుఠాణి.

ఈ నెట్ వర్క్ లో మెస్సర్స్ గిరిధర్ ఎంటర్ప్రయిసెస్, మెస్సర్స్ అరుణ్ సేల్స్, మెస్సర్స్ అక్షయ్ ట్రేడర్స్, మెస్సర్స్ శ్రీ పద్మావతి ఎంటర్ప్రయిసెస్ తో పటు మరో 19 సంస్థల పేర్లున్నాయి. వస్తు రహిత ఇన్వాయిస్ లను ఈ 23 సంస్థల పేర్లపై సృష్టించి, తప్పుడు ఐటీసీ పొంది, ప్రభుత్వానికి వాస్తవంగా చెల్లించాల్సిన జీఎస్‌టి చెల్లించకుండా ఎగ్గొట్టినట్టు అధికారులు కనుగొన్నారు. దివంగత దినేష్ గుప్త, శుభమ్ గుప్తా, వినోద్ జైన్, యోగేష్ గోయెల్ ఈ మోసపూరిత ఇన్వాయిస్ లను సృష్టించడంలో ప్రధాన పాత్రధారులుగా గుర్తించారు. ఈ సంస్థలు రూ.551 కోట్ల విలువ చేసే వస్తు-రహిత ఇన్వాయిస్ లను సృష్టించి రూ.91 కోట్ల అనుమతి లేని ఐటీసీని క్లెయిమ్ చేశారు. మొత్తం ముగ్గురు నిందితులూ తమ నేరాన్ని అంగీకరిస్తూ స్వచ్ఛంద స్టేట్మెంట్ ఇచ్చారు.

అందువల్ల, సిజిఎస్టి చట్టం, 2017 లోని సెక్షన్ 132 (1) (బి) మరియు 132 (1) (సి) ప్రకారం శుభమ్ గుప్తా, వినోద్ జైన్, యోగేష్ గోయెల్ గుర్తించదగ్గ నేరాలు, సెక్షన్ 132 (5) ప్రకారం నాన్ బెయిలబుల్ నేరాలకు పాల్పడ్డారు. సెక్షన్ 132 లోని సబ్ సెక్షన్ (1) లోని క్లాజ్ (ఐ) కింద వీరు శిక్షార్హులు. దీని ప్రకారం, వారిని 2021 జులై 10వ తేదీన సిజిఎస్‌టి చట్టం సెక్షన్ 132 కింద అరెస్టు చేశారు. డ్యూటీ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ వీరిని 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీకి రిమాండ్ చేస్తూ ఆదేశాలు జరీ చేశారు. తదుపరి దర్యాప్తు జరుగుతోంది.

జిఎస్‌టి ఎగవేతపై ఢిల్లీ జోన్ అధికారులు నిరంతర దృష్టి సారించారు. దీనిలో భాగంగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ. 91.256 కోట్లు ఎగవేత మొత్తాన్ని గుర్తించారు. ముగ్గురిని అరెస్టు చేశారు.

# మంత్రిత్వ శాఖలో కొనసాగుతున్న ప్రాజెక్టులను సమీక్షించిన కేంద్ర మంత్రి సర్బానంద సోనోవాల్

న్యూఢిల్లీ, జులై 12: ఓడరవాణా, రేవులు, జలమార్గ (పోర్ట్స్, షిప్పింగ్ అండ్ వాటర్‌వేస్) మంత్రిత్వ శాఖకు సంబంధించిన కొనసాగుతున్న ప్రాజెక్టుల స్థితిగతులను కేంద్ర మంత్రి సర్బానంద్ సోనోవాల్ ఆదివారం సమీక్షించారు. మంత్రిత్వ శాఖకు సంబంధించిన వివిధ ప్రాజెక్టుల స్థితిని గురించి ఎంపిఎస్‌డబ్ల్యు శాఖ కార్యదర్శి డాక్టర్ సంజీవ్ రంజన్ మంత్రికి వివరించారు. మంత్రిత్వ శాఖకు సంబంధించిన సీనియర్ అధికారులందరితో మంత్రి తన ఛాంబర్‌లో సంభాషించారు.

తనపై ఉంచిన బాధ్యతలను నెరవేర్చేందుకు అన్నిరకాలుగా కృషి చేస్తానని సర్బానంద్ తెలిపారు. తనకు ముందు మంత్రిగా ఉన్న వ్యక్తి ప్రారంభించిన మంచిపనులన్నింటినీ ముందుకు తీసుకువెడతానని, ఎటువంటి జాప్యాలు లేకుండా లక్ష్యంగా పెట్టుకున్న మైలురాళ్ళను సాధించేందుకు తన కొత్త టీంతో కలిసి తీవ్రంగా కృషి చేస్తానని వివరించారు.

ట్రాన్స్‌పోర్ట్ భవన్‌లో ఉన్న ఎంపిఎస్‌డబ్ల్యు కార్యాలయానికి వచ్చిన మంత్రికి, ఎంపిఎస్‌డబ్ల్యు కార్యదర్శి డాక్టర్ సంజీవ్ రంజన్, ఎంపిఎస్‌డబ్ల్యు అదనపు కార్యదర్శి సంజయ్ బందోపాధ్యాయ, సంయుక్త కార్యదర్శి (ఓడరేవులు) విక్రమ్ సింగ్, సంయుక్త కార్యదర్శి (పరిపాలన) లూకాస్ ఎల్ కామ్సువాన్ స్వాగతం పలికారు.

# కాళేశ్వరం జలాలతో రైతులకు సాగు భరోసా



కరీంనగర్ జులై 12 (నేటినిజం ప్రతినిధి): కాళేశ్వరం జలాలతో రైతులకు వానాకాలం సాగు కోసం భరోసా కల్పిస్తున్నామని మంత్రి గంగుల కమలాకర్ వెల్లడించారు. సోమవారం ఎల్ఎండీ జలాశయం నుంచి అధికారులతో కలసి దిగువకు నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా మంత్రి గంగుల మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ ముందుచూపుతో కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం చేపట్టారన్నారు. కాళేశ్వరం జలాలతో బీడు భూములన్నీ సాగులోకి వస్తున్నాయని తెలిపారు. సీఎం ఆదేశాల మేరకు లోయర్ మానేరు జలాశయం నుంచి కాకతీయ కాలువ ద్వారా దిగువకు నీటిని విడుదల చేస్తున్నామని పేర్కొన్నారు.

సాగుకు సమృద్ధిగా నీరు అందించాలనే ఉద్దేశంతో కాళేశ్వరం జలాలు ఎస్సారార్ ప్రాజెక్టులో ఎత్తి పోసినట్టు తెలిపారు.

రైతుల అవసరాన్ని దృష్టిలో ఉంచుకొని 10 రోజుల పాటు 3 వేల క్యూసెక్కుల నీటి విడుదల చేస్తామని చెప్పారు. రైతుల డిమాండ్ ను బట్టి అవసరమైతే నీటివిడుదల సామర్థ్యం 3 వేల 5 వేలకు పెంచుతామని పేర్కొన్నారు. కాకతీయ కాలువ ఆయకట్టు కింద సుమారు 9 లక్షల ఎకరాలు సాగులోకి వస్తుందని వెల్లడించారు. జులై మాసంలో ఎల్ఎండీలో ప్రస్తుతం 21 టీఎంసీల నీటితో జలకళ సంతరించుకుందని, గత చరిత్ర చూస్తే మానేరు జలాశయంలో జూన్ , జులై మాసంలో 5 టీఎంసీల నీటి నిల్వలు మాత్రమే ఉండే వని గుర్తు చేశారు.

కాళేశ్వరం జలాల రాకతో పరిస్థితులు మారి పోయాయన్నారు. నా చేతులతో నీటిని ఇతర ప్రాంతాలకు విడుదల చేయడం సంతోషంగా ఉందని మంత్రి తెలిపారు. ఎల్ఎండీ జలాశయం నుంచి విడుదల చేసిన నీరు కాకతీయ కాలువ ద్వారా కరీంనగర్ నుంచి సూర్యాపేట వరకు 7 జిల్లాలలోని 33 మండలాల్లోని భూములకు సాగునీరు అందిస్తుందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో మేయర్ సునీల్ రావు, సుంకిశాల సంపత్ రావు , నీటిపారుదల శాఖ ఈఎన్సీ శంకర్, ఎస్ఈ శివ కుమార్,ఈఈ నాగభూషణం, డిప్యూటీ ఈఈ సమ్మయ్య, ఏఈ లు కాళిదాసు, వంశీ, అంజు ఉన్నీసా, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ భవనాన్ని ప్రారంభించిన మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి

యాదాద్రి భువనగిరి, జులై 12: : యాదాద్రి భువనగిరి జిల్లాలో రాష్ట్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి, విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్ రెడ్డి పర్యటిస్తున్నారు. పర్యటనలో భాగంగా జిల్లా కేంద్రంలో రూ. 21.13 లక్షల వ్యయంతో నిర్మించిన ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ రెసిడెన్సీ భవనాన్ని మంత్రులు ఇంద్రకరణ్ రెడ్డి, జగదీశ్ రెడ్డి కలిసి ప్రారంభించారు. అంతకుముందు హరితహారం కార్యక్రమంలో భాగంగా మంత్రులు ఇంద్రకరణ్ రెడ్డి, జగదీశ్ రెడ్డి ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ రెసిడెన్సీ ప్రాంగణంలో మొక్కలు నాటారు.

ఈ కార్యక్రమంలో విప్ గొంగిడి సునీత మహేందర్ రెడ్డి, జడ్పీ చైర్మన్ సందీప్ రెడ్డి, ఎమ్మెల్సీ క్రిష్టారెడ్డి, భువనగిరి ఎమ్మెల్యే పైళ్ళ శేఖర్ రెడ్డి, పీసీసీఎఫ్ ఆర్ శోభ, పీసీసీఎఫ్ లోకేష్ జైస్వాల్, కలెక్టర్ పమేలా సత్పతి, సీసీఎఫ్ అక్బర్, డీఎఫ్‌వో డీవీ రెడ్డి, ఇతర అధికారులు, ప్రజాప్రతినిదులు పాల్గొన్నారు.

# నాగ్‌పుర్‌లో నిర్మించిన దేశపు మొదటి ఎల్ఎన్‌జీ ఫెసిలిటీ ప్లాంటును ప్రారంభించిన కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ

న్యూఢిల్లీ, జులై 12: శక్తి, విద్యుత్ రంగాల దిశగా వ్యవసాయాన్ని వైవిధ్యీకరించడంలో ప్రత్యామ్నాయ జీవ ఇంధనాల ప్రాధాన్యతను కేంద్ర రహదారి రవాణా, హైవేల శాఖ మంత్రి శ్రీ నితిన్ గడ్కరీ నొక్కి వక్కాణించారు. నాగ్‌పూర్‌లో నిర్మించిన దేశపు మొట్టమొదటి ఎల్ఎన్‌జీ ఫెసిలిటీ ప్లాంటును కేంద్ర మంత్రి ప్రారంభించారు. పెట్రోలు, డీజిల్, ఇతర ఇంధన ఉత్పత్తుల దిగుమతి కోసం రూ.8 లక్షల కోట్లను మన దేశం ఖర్చు చేస్తున్న విషయాన్ని ప్రస్తావించిన శ్రీ గడ్కరీ, దీనిని అతి పెద్ద సవాలుగా అభివర్ణించారు. తక్కువ ఖర్చుతో, కాలుష్య రహితమైన, దేశీయ ఇథనాల్, బయో సీఎన్‌జీ, ఎల్ఎన్‌జీ, హైడ్రోజన్ ఇంధనాలను ప్రత్యామ్నాయాలుగా చేసుకుని, వాటి దిగుమతుల అభివృద్ధిని ప్రోత్సహించేలా ఒక విధానాన్ని రూపొందించినట్లు మంత్రి వెల్లడించారు. వివిధ ప్రత్యామ్నాయ ఇంధనాల కోసం మంత్రిత్వ శాఖ అవిశ్రాంతంగా కృషి చేస్తోందని చెప్పారు. వరి, మొక్కజొన్న, చక్కెరలో మిగుల్లు వృథాగా పోకుండా, వాటిని వినియోగించుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు.

ఫ్లెక్స్ ఇంజిన్ల గురించి మాట్లాడుతూ, మరో మూడు నెలల్లో నిర్ణయం తీసుకుంటామని శ్రీ గడ్కరీ స్పష్టం చేశారు. వాహన తయారీదారులకు, ముఖ్యంగా నాలుగు చక్రాల వాహనాలు, ద్విచక్ర వాహనాల ఉత్పత్తిదారులకు, ఫ్లెక్స్ ఇంజిన్లను తయారు చేయడం తప్పనిసరి చేస్తామన్నారు. అమెరికా, కెనడా, బ్రెజిల్ వంటి చాలా దేశాల్లో ఇవి ఉన్నాయని చెప్పారు. పెట్రోలు ఇంజినైనా, ఫ్లెక్స్ ఇంజినైనా వాహనం ధరలో మార్పు ఉండదని శ్రీ గడ్కరీ వివరించారు.

# పెండింగ్ కేసుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టిసారించిన కరీంనగర్ కమిషనరేట్ పోలీసులు




కరీంనగర్ జులై 12 (నేటినిజం ప్రతినిధి): కరీంనగర్ కమిషనరేట్‌వ్యాప్తంగా పోలీసులు పెండింగ్ ఫిర్యాదుల పరిష్కారంపై దృష్టిసారించారు. ఇప్పటి వరకు లాక్‌డౌన్, ఇతరత్రా కారణాలతో అలుపెరుగకుండా విధులను నిర్వహించిన పోలీసులు పెండింగ్ ఫిర్యాదులపై దృష్టి కేంద్రీకరించడంతో ఎక్కువశాతం ఫిర్యాదులు పరిష్కారం అవుతున్నాయి. పరిష్కారం అయిన ఫిర్యాదులకు సంబంధించిన రెండు ధృవీకరణలను తీసుకుంటూ సిసిటిఎన్ఎస్ విధానంలో అప్‌లోడ్ చేస్తున్నారు. ప్రజల సమస్యలపై సత్వరం స్పందించడం, పరిష్కారం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా కరీంనగర్ కమిషనరేట్ హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ పోలీస్‌స్టేషన్ల తర్వాత స్థానంలో కొనసాగుతోంది. పోలీస్ కమిషనర్ విబి కమలాసన్‌రెడ్డి పోలీస్‌స్టేషన్లలోని వివిధ విభాగాల పనితీరును ఎప్పటికప్పుడూ సమీక్షిస్తున్నారు. ఆశించినస్థాయిలో రాణించని వారిని ఇతర విభాగాల విధులకు కేటాయిస్తున్నారు. వివిధ విభాగాల పనితీరును పోలీస్ కమిషనర్ విబి కమలాసన్‌రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేస్తున్నారు. ఈనెల వివిధ పోలీస్‌స్టేషన్లు, సర్కిల్, డివిజన్ కేంద్రాల స్థాయిలో కేసులన పరిష్కారం కోసం నిర్వహించిన సమీక్షలు పూర్తయ్యాయి.

మరోసారి దేశవ్యాప్తంగా ఉత్తమ పోలీస్‌స్టేషన్ల ఎంపిక ప్రధాన లక్ష్యంతో ముందుకుసాగుతున్నారుగుర్తింపు పొందిన విషయం విదితమే. నేరాల ఛేదనతో పాటు నియంత్రణకు తీసుకున్న చర్యలు, పోలీస్‌స్టేషన్‌లో పిర్యాదుదారులకు కనీస సౌకర్యాలు, పోలీస్‌స్టేషన్‌ను ఆహ్లాదకరంగా తీర్చిదిద్దడం, ఆచకీలేకుండా పోయిన కేసుల్లో సదరు వ్యక్తులను పట్టుకోవడం, సంబంధిత కుటుంబసభ్యులకు అప్పగించడం, ఆచూకీలేకుండా పోయిన కేసుల్లో నమోద కాబడి ఇతర ప్రాంతాల్లో జివిస్తున్న వారిని గుర్తించి పట్టుకునేందుకు కమిషనరేట్ పోలీసులు ప్రత్యేకబృందాలను ఏర్పాటు చేశారు. ఈ మధ్యకాలంలో పోలీస్‌స్టేషన్లలో కేసులు నమోదుకాబడి ఇతర ప్రాంతాల్లో జీవిస్తున్న వారినివారి కుటుంబసభ్యులకు అప్పగించిన విషయం విదితమే. వీటితోపాటు పెండింగ్ కేసుల పరిష్కారంపై ప్రత్యేకదృష్టిసారించారు. పెండింగ్ కేసులపై సమీక్షలు నిర్వహిస్తూ దర్యాప్తుల్లో నాణ్యత ప్రమాణలను పరిశీలిస్తున్నారు. వివిధ విభాగాల పనితీరును ఎప్పటికప్పుడు సిసిటిఎన్ఎస్‌లో ఆన్‌లైన్ చేయడం ద్వారా ఒకస్పష్టమైన నిర్ధారణకు వచ్చే అవకాశాలు ఉన్నాయి. మహిళలు, విద్యార్థినులపై జరిపే కేసులను దర్యాప్తులను ఒకనెల వ్యవధిలో పనిచేసి, ఛార్జిషీట్లను దాఖలు చేన్నారు.

ప్రత్యేక అధికారులతో పనుల పరిశీలన కమిషనరేట్‌లోని ప్రతి పోలీస్‌స్టేష్ జాతీయస్థాయిలో ఉత్తమ పోలీస్‌స్టేషన్ స్థానం సాధించే దిశగా అడుగులు వేస్తున్న పోలీసులు ఆయా పోలీస్‌స్టేషన్లలో పెండింగ్ కేసులు, వివిధ విభాగాల వారిగా ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తిచేయడం కోసం పోలీస్ కమిషనర్ విబి కమలాసన్‌రెడ్డి అనువజ్ఞులైన సీనియర్ పోలీసు అధికారులను నియమించడం జరిగింది. సదరు అధికారులు ప్రతిరోజు పోలీస్‌స్టేషన్లలో జరుగుతున్న వివిధ విభాగాల పనితీరును పర్యవేక్షణను కొనసాగిస్తున్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకునేందుకు సరిపడా పరకరాలు కమిషనరేట్‌లో అందుబాటులో ఉన్నాయి.

# పలు రాష్ట్రాల్లో భారీ నుంచి అతిభారీ వర్షపాతం కురిసే అవకాశం

హైదరాబాద్ , జులై 12:భారత వాతావరణ విభాగం(ఐఎండీ) అందించిన వాతావరణ సమాచారం ప్రకారం కొంకణ్ మరియు గోవా ప్రాంతాల్లో భారీ నుంచి అతిభారీ వర్షపాతం కురిసే అవకాశం ఉంది.

హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్, పంజాబ్, హరియాణ, చండీగఢ్, ఢిల్లీ, గుజరాత్, మధ్య మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ తీరప్రాంతాలతోపాటు యానమ్, తెలంగాణ, కర్ణాటక దక్షిణ తీరప్రాంతాలు, కేరళ, మాహె, తమిళనాడు, పుదుచ్చేరి, కరైకాల్ తదితర ప్రాంతాల్లో భారీ నుంచి అతిభారీ వర్షపాతం కురిసే అవకాశం ఉంది.

జమ్మూకశ్మీర్, లడఖ్, గిల్గిత్-బాల్టిస్తాన్, ముజఫరాబాద్, పశ్చిమ ఉత్తర ప్రదేశ్, తూర్పు రాజస్థాన్, పశ్చిమ మధ్యప్రదేశ్, బిహార్, ఉప హిమాలయన్, పశ్చిమ బెంగాల్ ,సిక్కిం, ఒడిశా, అండమాన్, నికోబార్ దీవుల్లోని పలు ప్రదేశాలతోపాటు సౌరాష్ట్ర, కచ్, మరాత్వాడ, రాయలసీమ, ఉత్తర కర్ణాటక, లక్షదీవుల్లోనూ భారీ వర్షపాతం కురుస్తుందని వాతావరణ విభాగం బులెటిన్ సూచించింది.

పంజాబ్, హరియాణ, చండీగఢ్, ఢిల్లీ, అండమాన్, నికోబార్ దీవులు, తెలంగాణతోపాటు జమ్ముకశ్మీర్, లడఖ్, గిల్గిట్?బాల్టిస్తాన్, ముజఫరాబాద్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తర ప్రదేశ్, రాజస్థాన్, విదర్భ, బిహార్, జార్ఖండ్, వెస్ట్ బెంగాల్, సిక్కిం, అసోం, మేఘాలయ, నాగాలాండ్, మణిపూర్, మిజోరాం, త్రిపుర, మధ్యమహారాష్ట్ర, మరాత్వాడా, ఆంధ్రప్రదేశ్ లోని తీరప్రాంతాలు, యానాం, రాయలసీమ, తమిళనాడు, పుదుచ్చేరి, కరైకాల్లో ఉరుములు మెరుపులతో కూడిన వర్షపాతం కురుస్తుందని, గాలుల వేగం గంటకు 30 నుంచి 40 కిలోమీటర్లుగా నమోదవుతుందని వాతావరణ విభాగం పేర్కొంది.పశ్చిమ రాజస్థాన్‌లోని పలు ప్రాంతాల్లో వేడిగాలులు వీస్తాయని, గంటకు 45?55 నుంచి 65 కిలోమీటర్ల వేగంతో వేడిగాలులు వీస్తాయని వాతావరణ విభాగం తెలిపింది. అరేబియా సముద్రంలో పశ్చిమ కేంద్ర, నైరుతి ప్రాంతంతోపాటు తూర్పు కేంద్ర, ఈశాన్య ప్రాంతంలోనూ వేడిగాలులు ప్రభావం ఉంటుందని వాతావరణ విభాగం తెలిపింది. గుజరాత్, మహారాష్ట్ర, గోవా, కర్ణాటక, కేరళ తీరాలతోపాటు లక్షద్వీప్తోపాటు బంగాళాఖాతంలోని పశ్చిమ కేంద్ర, దక్షిణ ప్రాంతాలు, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్లోని దక్షిణ తీర ప్రాంతాలు, మన్నార్ గల్ఫ్, అండమాన్ సముద్రంలోనూ ప్రభావం ఉంటుందని వాతవరణ విభాగం తెలిపింది. ఈ నేపథ్యంలో మత్స్యకారులెవరూ ఈ ప్రాంతాల్లోకి వెళ్లవద్దని వాతావరణ విభాగం సూచించింది.

# ఏపీలో మరోసారి కర్ఫ్యూ వేళల్లో మార్పులు



అమరావతి, జులై 12:ఏపీలో కరోనా పరిస్థితులపై అధికారులతో సోమవారం నాడు ఏపీ సీఎం జగన్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఏపీలో కర్ఫ్యూ సమయం సడలింపుపై నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ఒకే విధంగా కర్ఫ్యూ ఆంక్షలు అమలు చేయాలని సీఎం జగన్ ఆదేశాలు జారీ చేశారు. ఉదయం 6 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు కర్ఫ్యూ సడలింపులు ఇవ్వాలని ఆదేశించారు. రాత్రి 9 గంటలకు రాష్ట్రంలోని అన్ని షాపులను మూసివేయాలన్నారు. కరోనా నిబంధనలను అధికారులు కఠినంగా అమలు చేయాలని, మాస్కు లేకపోతే రూ.100 జరిమానా వేయాలన్నారు.

దుకాణాలలో సిబ్బంది, కొనుగోలు దారులు తప్పనిసరిగా మాస్కు ధరించాలని.. నిబంధనలు ఉల్లంఘిస్తే షాపులకు భారీ జరిమానాలు విధించాలన్నారు. నిబంధనలు పాటించని షాపులను 2-3 రోజులు మూసేయాలన్న జగన్.. నిబంధనల ఉల్లంఘనపై ఎవరు ఫోటో తీసి పంపినా ఫైన్లు విధించాలన్నారు. ఏపీ వ్యాప్తంగా 144 సెక్షన్ కఠినంగా అమలు చేయాలని.. ప్రజలెవరూ గుమిగూడకుండా చూడాలని సీఎం జగన్ ఆదేశించారు.కరోనాపై సీఎం జగన్ నిర్వహించిన సమీక్షలో మంత్రులు ఆళ్ల నాని, బొత్స సత్యనారాయణ, పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. మరోవైపు కరోనా వ్యాక్సినేషన్ కోసం తీసుకోవాల్సిన చర్యలపైనా సీఎం జగన్ అధికారులకు పలు సూచనలు చేశారు.

# కాలనీలను అభివృద్ధి చేసుకోవాలి..



హైదరాబాద్ , జులై 12:కాలనీల్లో నెలకొన్న సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే.. వాటిని వెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తానని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. సనత్‌నగర్ డివిజన్‌లోని రవీంద్రనగర్‌లో ఆదివారం మంత్రి స్థానిక కార్పొరేటర్ కొలను లక్ష్మిరెడ్డి, జోనల్ కమిషనర్ ప్రావీణ్య, డిప్యూటీ కమిషనర్ వంశీకృష్ణతో కలిసి కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం కాలనీవాసులు పడుతున్న మంచినీటి, డ్రైనేజీ సమస్యలను మంత్రికి తెలుపగా.. వెంటనే సంబంధించిన ఆయన పరిష్కార చర్యలు చేపట్టాలని సబంధిత అధికారులను ఆదేశించారు. దీంతో పాటు సనత్‌నగర్, అమీర్‌పేట్ డివిజన్లలో చెత్త సేకరణ చేపదుతున్న ఆటోలు, రిక్షాలు తమ కాలనీ రోడ్లపై పార్కింగ్ చేస్తుండటంతో ఇరుకుగా ఉన్న కాలనీ రోడ్లపై ఇబ్బందికర పరిస్థితులు తలెత్తుతున్నట్టు కాలనీవాసులు మంత్రికి వివరించారు. రవీంద్రనగర్ కాలనీ రోడ్లపై ఇబ్బందులు తొలగిపోయేలా చర్యలు తీసుకుంటామని మంత్రి వివరించారు. కార్యక్రమంలో టీఆర్ఎస్ నాయకుడు కొలను బాల్‌రెడ్డి, రవీంద్రనగర్ కాలనీ అధ్యక్షుడు విజయ్‌సింగ్ తదితరులు

# ఏపీ ప్రభుత్వానికి మరోసారి హైకోర్టులో షాక్

అమరావతి, జులై 12:ఏపీలో జగన్ ప్రభుత్వానికి మరోసారి హైకోర్టులో షాక్ తగిలింది. జీవో నెంబర్ 2ను ఏపీ హైకోర్టు సస్పెండ్ చేసింది. పంచాయతీ సర్పంచులు, సెక్రటరీల అధికారాలను వీఆర్‌వోలకు అప్పగిస్తూ జారీచేసిన జీవో నెం 2ను హైకోర్టు రద్దు చేసింది. జీవోను సవాల్ చేస్తూ గుంటూరు జిల్లా తురకపాలెం సర్పంచ్ కృష్ణమోహన్ హైకోర్టులో సవాల్ చేశారు. పిటిషనర్ తరపున వాదనలను న్యాయవాది నర్రా శ్రీనివాస్ వినిపించారు. పంచాయతీ సర్పంచ్ అధికారాలు వీఆర్‌వోలకు ఎలా ఇస్తారని హైకోర్టు ప్రశ్నించింది. ఇప్పటి వరకూ సర్పంచులు, కార్యదర్శుల ఆధ్వర్యంలో జరిగిన పాలనను.. వీఆర్‌వోలకు అప్పగించడమేంటని జగన్ ప్రభుత్వాన్ని ఏపీ హైకోర్టు నిలదీసింది. సంక్షేమ పథకాలను ప్రజలకు మరింత చేరువ చేసేందుకే తాము వీఆర్వో వ్యవస్థను తీసుకువచ్చామని ప్రభుత్వం తరపు న్యాయవాది కోర్టుకు వివరించారు. ఇరుపక్షాల వాదనలు విన్న కోర్టు జీవో నెంబర్ 2ను రద్దు చేస్తూ నిర్ణయం వెలువరించింది.

# యాదాద్రి ఆలయ నిర్మాణం అద్భుతం



హైదరాబాద్ , జులై 12:యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని ఆదివారం మేయర్ గద్వాల్ విజయలక్ష్మి సందర్శించారు. స్వామివారిని కొలిచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకుముందు ఆలయ అధికారులు, పూజారులు మేయర్‌కు ఘనస్వాగతం పలికి ప్రత్యేక ఆశీర్వచనాలు చేశారు. అనంతరం యాదాద్రి ఆలయ నిర్మాణ పనులను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యాదాద్రి ఆలయం ఉమ్మడి రాష్ట్రంలో ఎలాంటి అభివృద్ధికి నోచుకోలేదన్నారు. లక్ష్మీ నరసింహుడి ఆలయాన్ని అద్భుతంగా తీర్చిదిద్దుతున్న సీఎం కేసీఆర్‌కు మేయర్ కృతజ్ఞతలు తెలిపారు.

# ఆత్మహత్యలు చేసుకోవద్దు.. కడుపు శోకం పెట్టొద్దు : మంత్రి నిరంజన్ రెడ్డి



వనపర్తి, జులై 12:: చేతికొచ్చిన పిల్లలు ఆత్మహత్య చేసుకుని తల్లిదండ్రులకు కడుపుశోకం పెట్టొద్దు అని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్ రెడ్డి కోరారు. గోపాల్ పేట మండలం తాడిపర్తిలో నిరుద్యోగి కొండల్ తల్లిదండ్రులు వెంకటమ్మ, రాములును మంత్రి నిరంజన్ రెడ్డి పరామర్శించారు. వారికి స్వయంగా రూ.లక్ష సాయం అందజేసి, డబల్ బెడ్రూం ఇళ్లు నిర్మించి ఇస్తామని హామీ ఇచ్చారు.

ఈ సందర్భంగా మంత్రి నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ.. ఆత్మహత్యలు సమస్యలకు పరిష్కారం కాదు.. పట్టుదలతో, ఆత్మవిశ్వాసంతో జీవించాలని సూచించారు. నిరుద్యోగి కొండల్ ఆత్మహత్య బాధాకరమన్నారు. ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వడం ఏ ప్రభుత్వానికి సాధ్యం కాదన్నారు. ఏడేళ్లలో లక్షా 35 వేల ఉద్యోగాలు ఇచ్చాం.. మరో 50 వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్ రాబోతుంది. 50 వేల ఉద్యోగాలకు 5 లక్షల మంది పోటీ పడొచ్చు.. మరి మిగిలిన 4.5 లక్షల మందికి ఆత్మహత్యలు చేసుకోవాలని ఆలోచిస్తే సమస్య పరిష్కారం అవుతుందా? అని ప్రశ్నించారు. ఆత్మహత్యలకు రాజకీయం చేయొద్దు అని విజ్ఞప్తి చేశారు. తెలంగాణ ప్రభుత్వంలో ప్రజలకు ఉపాధి అవకాశాలు పెంచామని మంత్రి నిరంజన్ రెడ్డి స్పష్టం చేశారు.

నిరుద్యోగులను వారి స్నేహితులు హేళన చేసే విధంగా మాట్లాడొద్దు.. ఆత్మహత్యలు పరిష్కారం కాదు.. ఆత్మస్థైర్యంతో ముందుకెళ్లినప్పుడే విజయం సాధ్యమవుతుందన్నారు. ఇతరులెవరూ తమ అన్నలాగా చనిపోవద్దని ఆమె విజ్ఞప్తి చేశారు.

# ఇటలీ ఫ్యాన్స్ పై విరుచుకుపడిన ఇంగ్లాండు అభిమానులు..



హైదరాబాద్ , జులై 12:యూరో కప్ ఫైనల్లో తమ టీమ్ ఓడిపోవడాన్ని జీర్ణించుకోవడం లేదు ఇంగ్లండ్ అభిమానులు. ఇటలీతో జరిగిన ఫైనల్లో తమ టీమ్ ఓటమి చెందడంతో ఆగ్రహంతో స్టేడియంలోనే అరాచకం సృష్టించారు. స్టేడియంలోనే ఇటలీ అభిమానులపై చేయి చేసుకున్నారు. వాళ్లపై పిడిగుద్దులు కురిపిస్తూ.. కిందపడేసి తంతూ దారుణంగా వ్యవహరించారు. వాళ్లపై జాతి వివక్ష వ్యాఖ్యలు చేశారు. ఇటలీ జాతీయ జెండాను అవమానించారు. దానిపై ఉమ్ముతూ, కిందేసి తొక్కుతూ మరీ చిల్లరగా వ్యవహరించారు. ఆ తర్వాత కూడా వీధుల్లో రణరంగం సృష్టించారు. కొందరు రాళ్లు విసరడంతో పలు బిల్డింగ్‌ల అద్దాలు ధ్వంసమయ్యాయి. ఫ్యాన్స్ అరాచకానికి సంబంధించిన వీడియోలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఇంగ్లండ్ అభిమానుల తీరుపై ప్రపంచవ్యాప్తంగా తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

# ప్రతి ఇల్లు ఒక హరితవనంగా మారాలి

**-26,27 వార్డులలో ఇంటింటికీ మొక్కలు పంపిణీ**
**-మున్సిపల్ చైర్పర్సన్ రామతీర్థపుమాధవి రాజు**

రాజన్న సిరిసిల్ల, జులై 12: (నేటినిజం ప్రతినిధి): ప్రతి ఇల్లు ఒక హరిత వనంగా మారాలని అందుకు బాధ్యతగా ప్రతి ఒక్కరు ఇంటింటికీ మొక్కలు నాటాలని జగిత్యాల మున్సిపల్ చైర్పర్సన్ రామతీర్థపు మాధవి రాజు అన్నారు. సోమవారం పట్టణ ప్రగతి, హరితహారంలో భాగంగా వేములవాడ మున్సిపల్ పరిధిలోని 26,27 వార్డు కౌన్సిలర్లు ముప్పిడి సునంద శ్రీనివాస్,గోలి మహేష్ ఆధ్వర్యంలోవార్డుల్లో పూలు , పండ్ల మొక్కలను మున్సిపల్ చైర్పర్సన్ రామతీర్థపు మాధవి రాజుతో పాటు కమిషనర్ శ్యామ్ సుందర్ రావు కౌన్సిలర్లు ముప్పిడి సునంద శ్రీనివాస్,గోలిమహేష్ ఇంటింటికి పంపిణీచేశారు.





ఈ సందర్భంగా మాధవి మాట్లాడుతూ హరితహారములో నాటిన మొక్కలను సంరక్షిస్తే అవి వృక్షాలై మనకు నిడతో పాటు ప్రాణావాయువును అందిస్తూ మానవాళికి అండగా నిలుస్తాయని తెలిపారు.

పట్టణాలు, పల్లెలు పచ్చదనంతో కళకళలాడాలని, ప్రజలు ఆరోగ్యవంతమైన జీవనాన్ని గడపాలనే మంచి ఆలోచనతో ముఖ్యమంత్రి కేసీఆర్? తెలంగాణ లో హరితహారం అనే మహోత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని ఆమె తెలిపారు.

# దమ్మున్న నాయకుడు సీఎం కేసీఆర్

నల్లగొండ, జులై 12:: దేశ రాజకీయాల్లో దమ్మున్న నాయకుడు సీఎం కేసీఆర్ అని నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. ఖఓఉజా, జీవవైవిధ్య కమిటీ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అమృత్ మహోత్సవం కార్యక్రమంలో భాగంగా సోమవారం చిట్యాల మండలం నేరడ-ఎలికట్టె గ్రామ సరిహద్దుల్లో రోడ్డుకు ఇరువైపులా ఎమ్మెల్యే ఇరు గ్రామాల ప్రజలతో కలిసి మొక్కలు నాటారు. తొలుత నేరడ గ్రామంలోని ఎస్సీ కాలనీ మహిళలతో ఎమ్మెల్యే మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాలనీలో పేరుకుపోయిన అన్ని సమస్యలను త్వరత్వరగతిన పూర్తి చేస్తామని తెలిపారు.

కాలనీలో అస్తవ్యస్తంగా ఉన్న డ్రైనేజీ వ్యవస్థకు ప్రతిపాదనలను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా సీఎం కేసీఆర్ ప్రభుత్వం పనిచేస్తుందని అన్నారు.

గతంలో ఏ ప్రభుత్వాలు, ఏ ముఖ్యమంత్రులు చేయని సాహసోపేతమైన నిర్ణయాలతో సీఎం కేసీఆర్ అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టారని తెలిపారు. ప్రతి మండలంలో లక్ష మొక్కలను నాటడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని పేర్కొన్నారు. గ్రామాల్లో అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలను దశలవారీగా సమకూర్చుతామని తెలిపారు.

# పెంచిన పెట్రోల్ డీజిల్ గ్యాస్ ధరల నిరసన కార్యక్రమానికి తరలివెళ్లిన వేములవాడ కాంగ్రెస్ శ్రేణులు




రాజన్న సిరిసిల్ల, జులై 12: (నేటినిజం ప్రతినిధి): వేములవాడ పట్టణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో సైకిల్ యాత్ర కార్యక్రమానికి వేములవాడ పట్టణం నుండి 150 సైకిళ్లతో కాంగ్రెస్ పార్టీ నాయకులు అందరూ తరలి వెళ్లడం జరిగింది. పెంచిన ధరలను వెంటనే తగ్గించాలని పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు సాగరం వెంకటస్వామి డిమాండ్ చేశారు. సామాన్య ప్రజలపై పెనుభారం గా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవహరించడం సరైందికాదని ఆయన అన్నారు. పెంచిన పెట్రోల్ డీజిల్ గ్యాస్ ధరలు తగ్గించాలి లేని ఎడల కాంగ్రెస్ పార్టీ తరపున పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి చంద్రగిరి శ్రీనివాస్ గౌడ్, నాయకులు చిలక రమేష్, కూరగాయల కొమురయ్య, ముడిగి చంద్రశేఖర్, కనికరపు రాకేష్, నాగుల విష్ణు ప్రసాద్ , వస్తాది కృష్ణ కోలకాని రాజు, నాగుల రాము గౌడ్, చిలివేరి శ్రీనివాస్, వనపర్తి శంకర్, మర్రిపల్లి రాజు, మే0డే రాజు, తదితరులు తరలి వెళ్లడం జరిగింది

# రైల్వే స్టేషన్‌లో ఆగిన రైలులో ప్రసవించిన మహిళ

భువనేశ్వర్, జులై 12:: రైల్వే స్టేషన్‌లో ఆగిన రైలులో ఒక మహిళ ప్రసవించింది. మగ శిశువునకు జన్మనిచ్చింది. ఒడిశా రాజధాని భువనేశ్వర్‌లో ఈ ఘటన జరిగింది. 27 ఏండ్ల ఆయేషా ఖాతున్, యశ్వంత్‌పూర్ వెళ్లేందుకు ఆదివారం హౌరా-యశ్వంత్‌పూర్ ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణించారు. అయితే రైలు కటక్ స్టేషన్ దాటగానే ఆమెకు నొప్పులు మొదలయ్యాయి. దీంతో టికెట్ కలెక్టర్ భువనేశ్వర్ రైల్వే స్టేషన్ డైరెక్టర్‌కు సమాచారం ఇచ్చారు. ఆ రైలు భువనేశ్వర్ రైల్వే స్టేషన్‌కు చేరగానే వైద్య, మహిళా సహాయక సిబ్బంది ఆమె ఉన్న కోచ్ వద్దకు వచ్చారు. వారి సహాయంతో ఆయేషా రైలు కోచ్‌లోనే ప్రసవించింది. పండంటి బాబుకు ఆమె జన్మనిచ్చింది.

తల్లీబిడ్డలకు ప్రాథమిక చికిత్స అందించిన అనంతరం భువనేశ్వర్‌లోని ఆసుపత్రికి తరలించారు. తల్లీబిడ్డ ఆరోగ్యంతో ఉండటంతో యశ్వంత్‌పూర్‌కు వెళ్లేందుకు రైలు టికెట్‌తోపాటు బిస్కెట్లను భువనేశ్వర్ స్టేషన్ డైరెక్టర్ చిత్తరంజన్ నాయక్ ఆమెకు అందజేశారు. దీంతో ఆయేషా తన బాబుతో కలిసి సోమవారం మరో రైలులో యశ్వంత్‌పూర్‌కు ప్రయాణమయ్యారు. తనకు సహకరించిన రైల్వే అధికారులు, సిబ్బందికి ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

# గ్రామ స్థాయిలోనే జ్వరాల తీవ్రతను నియంత్రించాలి




మహబూబ్‌నగర్, జులై 12:గ్రామస్థాయిలో వైద్యాధికారులు పర్యటిస్తూ వైద్య, ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. అనారోగ్యంగా ఉన్న వారి నమూనా ఫలితాల ఆధారంగా వైద్య చికిత్స అందజేయాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సయ్యద్ ముర్తుజా రిజ్వీ అధికారులను ఆదేశించారు. సోమవారం డోర్నకల్ మున్సిపల్ పరిధిలోని రైల్వే కమ్యూనిటీ హాల్‌లో కరోనా, సీజనల్ వ్యాధులపై జిల్లా కలెక్టర్ వి.పి గౌతమ్ తో కలిసి జిల్లా వైద్య అధికారులతో సమగ్రంగా సమీక్షించారు.

జిల్లాలో వైద్య శాఖ కార్యకలాపాలను రిజ్వీకి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ సెక్రెటరీ మాట్లాడుతూ.. గ్రామస్థాయిలో ఎప్పటికప్పుడు పారిశుధ్యం మెరుగు పరచాలన్నారు. తాగు క్లోరినేషన్ చేయాలన్నారు. దోమలు పెరగకుండా దోమ లార్వా నిరోధించేందుకు క్షేత్ర స్థాయి అధికారులు నిరంతర పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. సమీక్షలు నిర్వహించాలని మున్సిపల్ అధికారులు గ్రామపంచాయతీ సిబ్బంది తో చర్యలు తీసుకోవాలన్నారు. పీహెచ్‌సీ స్థాయిలో ప్రతి రోజూ 300 ఆర్టీపీసీఆర్ టెస్టులు చేపట్టాలని సూచించారు. గ్రామాలలో ఫీవర్ సర్వే చేపడుతూనే ఉండాలన్నారు. గిరిజన ప్రాంతాల్లో వ్యాక్సినేషన్ కు ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు.

కింది స్థాయిలో పటిష్టమైన ప్రణాళిక రూపొందించుకొని పర్యవేక్షణ చేస్తూ గ్రామస్థాయిలో జ్వరాలు తగ్గించాలన్నారు. వైద్యాధికారులు స్థానికంగా ఉండాలన్నారు. జ్వరాలు వస్తే తాత్కాలికంగా వైద్యం చేసి ఊరుకో రాదని అధికారులతో సమన్వయం పెంచుకొని లోతుగా అధ్యయనం చేస్తూ పరిశోధన మొదలు పెట్టాలన్నారు. జ్వరాలు పెరగకుండా గ్రామస్థాయిలోనే నియంత్రించాలని సూచించారు. వ్యాక్సినేషన్ ప్రక్రియ పక్కాగా చేపట్టాలన్నారు. జిల్లా కేంద్రాలలో వైద్య సౌకర్యాలు మెరుగుపరచాలని, నిరుపేదలకు ఇబ్బందులు కలగకుండా వైద్య అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

కార్యక్రమంలో డీఎంఈ రమేష్ రెడ్డి, డీహెచ్‌డీ శ్రీనివాసరావు, టీఎస్ ఎస్ఎంఎస్ ఐడీసీ ఎండీ చంద్రశేఖర్ ముఖ్యమంత్రి కార్యాలయ కార్యదర్శి డాక్టర్ గంగాధర్, ట్రైనీ కలెక్టర్ అభిషేక్ అగస్త్య, జిల్లా వైద్య శాఖ అధికారి హరీష్ రాజు, ఉప వైద్యాధికారి అంబరీష, కొవిడ్ నోడల్ అధికారి రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీకి పాడి కౌశిక్‌రెడ్డి రాజీనామా?

హైదరాబాద్ , జులై 12: హుజూరాబాద్ నియోజకవర్గ నేత పాడి కౌశిక్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేయనున్నట్లు సమాచారం. ఈ మేరకు ప్రత్యేకంగా మీడియా సమావేశం ఏర్పాటు చేసి భవిష్యత్ కార్యాచరణ ప్రకటించనున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే కౌశిక్‌రెడ్డికి పీసీసీ క్రమశిక్షణా సంఘం షోకాజ్ నోటీసులు జారీ చేసింది. 24 గంటల్లో వివరణ ఇవ్వాలని నోటీసుల్లో ఆదేశించింది. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు నోటీసుల్లో పేర్కొంది. గతంలో కౌశిక్‌రెడ్డిని పీసీసీ క్రమశిక్షణా సంఘం హెచ్చరించిన విషయం తెలిసిందే.

# యోగి సర్కార్ పాపులేషన్ పాలసీపై ఎన్సీపీ నేత కీలక వ్యాఖ్యలు

ముంబై, జులై 12:: యూపీలో యోగి ఆదిత్యానాథ్ ప్రభుత్వం ఇద్దరు పిల్లల విధానంపై హడావిడి చేస్తోందని ఎన్సీపీ నేత నవాబ్ మాలిక్ వ్యాఖ్యానించారు. ఇద్దరికి మించి పిల్లలను కలిగిఉండరాదనే విధానం కొత్తది కాదని, మహారాష్ట్ర సహా పలు రాష్ట్రాల్లో అమలవుతోందని చెప్పారు. మహారాష్ట్రలో ఇద్దరు పిల్లలకు మించి సంతానం ఉంటే వారు స్థానిక ఎన్నికల్లో పోటీకి అనర్హులనే నిబంధన ఉన్నదని పేర్కొన్నారు. ఇక యూపీలో తీసుకువచ్చిన ముసాయిదా పాలసీ ప్రకారం ఇద్దరు కంటే ఎక్కువ మంది పిల్లలు ఉంటే స్థానిక సంస్థల్లో పోటీ చేసేందుకు అనర్హులు కావడంతో పాటు ప్రభుత్వ ఉద్యోగాల్లో పదోన్నతి కోల్పోతారు. ప్రభుత్వ సబ్సిడీ పొందేందుకు వీరు అనర్హులుగా పరిగణించబడతారు. ఇక యూపీ సీఎం అసలు సంతానం వద్దని లేదా అధిక సంతానాన్ని ప్రోత్సహించే విధానాన్ని తీసుకురావాలని ఎన్సీపీ నేత నవాబ్ మాలిక్ సూచించారు. ఓవైపు బీజేపీ, ఆరెస్సెస్ నేతలు చాలా మంది అవివాహితులై సంతానం లేదని, మరోవైపు సాక్షి మహరాజ్ వంటి కాషాయ పార్టీ నేతలు హిందువులను ఎక్కువ మంది పిల్లల్ని కనాలని కోరుతుంటారని చెప్పుకొచ్చారు. అందుకే పార్టీ నేతల కోరిక మేరకు ఆ తరహా విధానాన్ని యోగి ఆదిత్యానాథ్ తీసుకురావాలని మాలిక్ సూచించారు. ఇక తన కదలికలపై మహారాష్ట్ర సంకీర్ణ సర్కార్ కన్నేసిందని కాంగ్రెస్ రాష్ట్ర శాఖ చీఫ్ నానా పటోలె ఆరోపణలను ఆయన తోసిపుచ్చారు.

# మృతుల కుటుంబాలను పరామర్శించి ఆర్థిక సహాయం చేసిన తెరాస సీనియర్ నాయకులు ఏనుగు మనోహర్ రెడ్డి

రాజన్న సిరిసిల్ల, జులై 12: (నేటినిజం ప్రతినిధి): రు ద్రంగి మండలకేంద్రనికి చెందిన రైతు బంధు సమితి సభ్యుడు పాల నర్సయ్య తండ్రి పాల కొండయ్య మృతి చెందగా అతని కుటుంబ సభ్యులను సోమవారం రోజున తెరాస సీనియర్ నాయకులు ఏనుగు మనోహర్ రెడ్డి.జడ్పిటిసి గట్ల మినయ్య, పరామర్శించారు.

అలాగే గత వారం రోజుల క్రితం సౌదీ దేశంలో చనిపోయిన బోదను నర్సయ్య కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

అలాగే గల్ఫ్ బాధితుని కుటుంబ పరిస్థితి చూసి ఏనుగు మనోహర్ రెడ్డి 5000ల రూపాయలు అలాగే శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయ చైర్మన్ కొమిరె శంకర్ 5000ల రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు.వారి వెంట తెరాస సీనియర్ నాయకుడు మడిశెట్టి



ఆనందం,కేసిరెడ్డి నర్సారెడ్డి,మంచే రాజేశం,గంగం మహేష్,దెయ్యాల కమలాకర్,పుదారి శ్రీనివాస్,అల్లూరి రాజిరెడ్డి,కోడిగంటి శ్యామ్,గొళ్ళెం నర్సింగ్, కదాసు లక్ష్మణ్,మరిగడ్డ సతీష్,కొల మధు,గుగులోత్ఉపేందర్,తదితరులు పాల్గొన్నారు..

# కేసీఆర్ ఎకో అర్బన్ పార్కులో సీడ్స్ బాల్స్ చల్లే కార్యక్రమం.. ప్రారంభించిన ఎంపీ సంతోష్, మంత్రి శ్రీనివాస్‌గౌడ్



మహబూబ్‌నగర్, జులై 12:మహబూబ్‌నగర్ జిల్లాలోని కేసీఆర్ ఎకో అర్బన్ పార్కులో 2 కోట్ల 8 లక్షల సీడ్ బాల్స్ చల్లే కార్యక్రమాన్ని ఎంపీ జోగినపల్లి సంతోష్ కుమార్, మంత్రి శ్రీనివాస్ గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ సంతోష్ కుమార్ మాట్లాడుతూ.. కేసీఆర్ ఎకో అర్బన్ పార్కును అంచెలంచెలుగా అభివృద్ధి చేస్తున్నారని చెప్పారు. ఈ పార్కు అభివృద్ధి కోసం తన వంతు సహకారం కూడా అందిస్తానని ఆయన తెలిపారు.

పదేండ్ల క్రితం మహబూబ్‌నగర్‌లో నమస్తే తెలంగాణ యూనిట్ ప్రారంభానికి వచ్చినప్పుడు సేదదీరుదామంటే ఎక్కడా అవకాశం లేదని, ఇప్పుడు ఎటు చూసినా పచ్చదనమే కనిపిస్తున్నదని ఎంపీ పేర్కొన్నారు. అదేవిధంగా రెండు కోట్ల సీడ్ బాల్స్ తయారు చేసిన మహిళలందరికీ ఎంపీ సంతోష్ కుమార్ ధన్యవాదాలు తెలియజేశారు. మంత్రి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. చెట్లను నరకడంవల్ల వాతావరణ సమతుల్యం దెబ్బతింటుందన్నారు.

పర్యావరణ పరిరక్షణ కోసమే సీఎం కేసీఆర్ చెట్లు నాటే కార్యక్రమాన్ని చేపట్టారని శ్రీనివాస్‌గౌడ్ చెప్పారు. ఎంపీ సంతోష్ కుమార్ గ్రీన్ ఇండియా ఛాలెంజ్ చేపట్టి దేశవ్యాప్తం చేశారని, ప్రతి ఒక్కరిలో ప్రకృతిని కాపాడుకోవాలనే అవగాహన కల్పించారని మంత్రి కొనియాడారు. జిల్లా ప్రజలంతా తమ పుట్టినరోజులను మొక్కలు నాటి జరుపుకోవాలని సూచించారు. చిన్నగా ఉన్న మయూరి నర్సరీని 2097 ఎకరాల విస్తీర్ణంలో కేసీఆర్ ఎకో అర్బన్ పార్కుగా అభివృద్ధి చేస్తున్నామని మంత్రి చెప్పారు.

# అడవుల పునరుద్ధరణే సీఎం కేసీఆర్ లక్ష్యం

యాదాద్రి భువనగిరి, జులై 12: : తెలంగాణలో క్షీణించిన అడవుల పునరుద్ధరణ, పచ్చదనం పెంచాలన్నదే సీఎం కేసీఆర్ హరిత సంకల్పమని మంత్రులు ఇంద్రకరణ్ రెడ్డి, జగదీష్ రెడ్డి అన్నారు. రాయగిరి సమీపంలోని ఆంజనేయ అరణ్యంలో అటవీ పునర్జీవ చర్యల్లో భాగంగా గుట్టల ప్రాంతంలో (నాటిన సెర్మోనియల్ / రాకీ) ప్లాంటేషన్ ను మంత్రులు పరిశీలించారు. అనంతరం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..సీఎం కేసీఆర్ ఆశయాలకు అనుగుణంగా హరితహారం కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా మొక్కలు నాటుతున్నామని తెలిపారు.హరితహారం కార్యక్రమం వల్ల ప్రజల్లో అవగాహన పెరిగిందని చెప్పారు. తెలంగాణ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలతో రాష్ట్రంలో నాలుగు శాతం పచ్చదనం పెరిగిందన్నారు. పర్యావరణ సమతుల్యతతోనే మానవ మనుగడ సాధ్యమవుతుందన్నారు.అడవుల పునర్జీవం, ప్రత్యామ్నాయ అడవుల పునరుద్ధరణ, హరితహారం కార్యక్రమాల వల్ల యాదాద్రి జిల్లాలో పచ్చదనం పెరిగింద`న్నారు. యాదాద్రి లక్ష్మీనరసింహ స్వామి వారి ఆలయం పునఃప్రారంభం తర్వాత ఈ ప్రాంతం మరింత కళకళలాడుతుందని పేర్కొన్నారు.



# బీజేపీ నుంచి టీఆర్ఎస్‌లోకి భారీగా చేరికలు



నిజామాబాద్, జులై 12:: అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై వివధ పార్టీల నుంచి టీఆర్ఎస్‌లో చేరుతున్నారని మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. బాల్కొండ మండల కేంద్రానికి చెందిన వార్డు మెంబర్ రాజేష్, బీజేపీ పార్టీ జిల్లా కార్యదర్శి హరీష్ ఆధ్వర్యంలో 200 మంది యువకులు మంత్రి సమక్షంలో టీఆర్ఎస్‌లో చేరారు. వారికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. యువత టీఆర్ఎస్‌లో చేరడం శుభపరిణామమన్నారు.

యువతలో మార్పు బాల్కొండ నుంచే ప్రారంభం అయిందని తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల్లో విద్వేషాలు, సోషల్ మీడియా అబద్ధాల ప్రచారాల మధ్య నుంచి అభివృద్ధి వైపు రావడం మీరు తీసుకున్న గొప్ప నిర్ణయమని వారిని ప్రశంసించారు. మీరిచ్చే బలంతో నేను మరింత ఉత్సాహంతో పనిచేస్తా అన్నారు. యువత సోషల్ మీడియాలో వచ్చే సెన్సేషన్ కి ఆకర్షితులు అవుతున్నారు. అదే నిజం అనేలా యువతను మాయమాటలతో నమ్మిస్తున్నారు.

అభివృద్ధి పనులు, మంచి చేసే పనులు సోషల్ మీడియాలో ప్రచారం కావన్నారు. అభివృద్ధి విషయాలు వైరల్ కావడం లేదు. దాని నుంచి యువత బయటకు రావాలని పిలుపునిచ్చారు.

బండి సంజయ్, రేవంత్ రెడ్డి, అర్వింద్ ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారు. వారు నేను అడిగిన వాటికి సమాధానం చెప్పాలన్నారు.

నేను హిందువునే. ఎంపీ అర్వింద్ హిందువే. నేను 31 గుడులు కట్టించిన. నీవు ఒక్క గుడి అయిన కట్టించినవా అర్వింద్ అని సూటిగా ప్రశ్నించారు. జై శ్రీరాం అని హృదయం లోంచి రావాలి. ఊరికే మాట్లాడడం కాదని హితవు పలికారు. యువత సోషల్ మీడియాలో ప్రభుత్వ పథకాలను ముందుకు తీసుకెళ్లాలన్నారు.

# ఏపీలో మాస్క్ ధరించకుంటే కఠిన చర్యలు..

అమరావతి, జులై 12:ఏపీలో కరోనా కేసులు ఇప్పుడిప్పుడే తగ్గుముఖం పడుతున్నాయి..అయితే కేసుల ఉధృతి మరల పెరగకుండా కఠిన ఆంక్షలను కొనసాగిస్తోంది ప్రభుత్వం. మాస్కులు ధరించని వారిపై కఠిన చర్యలు తీసుకునేందుకు సిద్ధమవుతోంది? ప్రతి ఒక్కరు బయటకు వచ్చినప్పుడు మాస్క్ ధరించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది..మాస్క్ ధరించకపోతే రూ.100ల జరిమానా కచ్చితంగా అమలు చేసేవిధంగా నిర్ణయం తీసుకున్నారు. దుకాణాల్లో కూడా సిబ్బంది దగ్గర నుంచి వినియోగదారులకు వరకూ మాస్కులు ధరించాల్సిందే. ఉల్లంఘనలకు పాల్పడితే దుకాణాలకు భారీ జరిమానాలతో పాటు అవసరమైతే 2?3 రోజులు దుకాణాలు మూసివేతకు ప్రభుత్వం ఆదేశించింది. ఉల్లంఘనలకు పాల్పడ్డారని ఎవరైనా ఫొటో తీసి పంపినా జరిమానాలు విధించే విధంగా దీని కోసం ప్రత్యేక వాట్సాప్ నంబర్ ఏర్పాటు, రాష్ట్రవ్యాప్తంగా 144 సెక్షన్ కఠినంగా అమలు జరిగే విధంగా ప్రభుత్వం నిర్ణయించింది. ప్రజలెవ్వరూ గుమిగూడకుండా కఠిన ఆంక్షలతో పాటు మార్కెట్లు, తదితర చోట్ల కూడా మాస్కులు ధరించాలంటూ ఆదేశాలు జారీ అయ్యాయి. మార్కెట్ కమిటీలు మాస్కులు ధరించేలా చూడాలంటూ ప్రభుత్వం ఆదేశించింది.

Printed, Published and owned by VEENADAS,at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74,Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas.
**RNI No.52865/93.** E-mail :netinijam93@gmail.com.